

బడుగుల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

పోరుమామిళ్ల టౌన్: బడుగుల ఆశాజ్యోతి డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జగ్జీవన్ రామ్ ఆశయ సాధన సమితి అధ్యక్షులు ఎస్.జాకబ్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధన సమితి ప్రతినిధుల ఐక్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ 5వ తేదీన బాబు జగజ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించేందుకు మాదిగల ఆత్మీయ సమాలోచన సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. పోరుమామిళ్లలో జగ్జీవన్ విగ్రహం ఏర్పాటు, నియోజకవర్గంలోని కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, బి.కోడూరు మండలాల్లో గత సంవత్సరం పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన వారికి ప్రోత్సాహక బహుమతుల ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జయపాల్, ప్రసాదరావు, యోహాను, సగిలి రాయప్ప పోరుమామిళ్ల జోకోబు, మండలాల బాధ్యతలు నిర్వహించే యువకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు ప్రలోభాలు!

- ఓ ప్రయివేటు పాఠశాలలో లంచ్ బాక్సుల నిల్వ
- వరుసగా రెండో రోజూ పంపిణీకి యత్నం
- సిఎం జిల్లాలో నిబంధనలు బేఖాతర్


ఓ ప్రయివేటు పాఠశాలలో నిల్వ ఉంచిన లంచ్ బాక్సులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు తెరలేచింది. సాధారణంగా పోలింగ్‌కు రెండ్రోజుల ముందు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం చూశాం. కానీ ప్రస్తుతం ఎన్నికల ట్రెండ్ మారినట్లు కనిపిస్తోంది. పాత పద్ధతికి స్వస్తి చెప్పి కొత్త అంకానికి తెరలేపడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ముఖ్యమంత్రి జిల్లా కడపలో ఎన్నికల నిబంధనలు బేఖాతర్‌ చేసి యథేచ్ఛగా ప్రలోభాలకు గురిచేయడం చర్చనీయాంశంగా మారింది. కడప-కర్నూలు-అనంతపురం ఉపాధ్యాయ ఎన్నికల్లో తాయిలాల పర్వం ఊపందుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో అధికార వైసిపి, ఎపిటిఎఫ్, ఆపస్, పిడిఎఫ్ తరుపున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారాలను సైతం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయకపోవడం, ఉపాధ్యాయులకు వేతనాలను సకాలంలో విడుదల చేయకపోవడం, యాప్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయించడం, ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించడం, ఉపాధ్యాయ సంఘాల నేతలకు నోటీసులు ఇవ్వడం వంటి చర్యల కారణంగా ఉపాధ్యాయుల్లో ఆగ్రహం వెల్లువెత్తుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో అధికార పార్టీ తరుపున ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థి ఎలాగైనా గెలవాలనే ధ్యేయంతో పెద్దఎత్తున ప్రలోభాలకు తెరలేపినట్లు కనిపిస్తోంది. నిన్నటి రోజున జిల్లాలోని కడప, బద్వేల్, ప్రొద్దుటూరు, మైదుకూరు, వల్లూరు, కొండాపురం వంటి పలు ప్రాంతాల్లో తాయిలాల పంపిణీ వ్యవహారం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. 24 గంటలు గడవక మునుపే రెండవ సారి కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, ఎస్‌బి బంగ్లాకు కూతవేటు దూరంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో లంచ్ బాక్సుల పంపిణీ ప్రక్రియ సాగిపోతుండడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల తొమ్మిదిన ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 16న నోటిఫికేషన్, మార్చి 13న పోలింగ్ 16న కౌంటింగ్ చేపట్టనున్నట్లు తెలిపింది. పోలింగ్‌కు నెల రోజుల వ్యవధి నేపథ్యంలో అధికార పార్టీ తరుపున బరిలో నిలవనున్న అభ్యర్థి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో అడ్డదారులను ఆశ్రయిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్ష టిడిపి తరుపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయని సంగతి తెలిసిందే. అధికార పార్టీ అండ ఉందనే తెంపరితనంతో ఎన్నికల నిబంధనలను నిలువునా ఉల్లంఘించడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని యామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేయడం దగ్గర నుంచి తాజాగా లంచ్ బాక్సుల పంపిణీ వ్యవహారాల్ని వరుసగా బట్టబయలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. శనివారం యుటిఎఫ్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సుకు తిరుపాలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం జారీచేసిన 132, 680 జిఒలను వెంటనే అమలు చేయాలని కోరారు. జిఎంఎస్ నంబర్ 159 ప్రకారం ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చిందని పేర్కొన్నారు. ఈ కొత్త హాజరు విధానం ద్వారా ఎవరి సెల్‌ఫోన్‌లో వారే స్వయంగా ప్రభుత్వ నిర్ణయించిన ప్రదేశంలో ఫోటో తీసి ప్రభుత్వ యాప్‌లో హాజరు పంపించాలని తెలిపారు. మన గ్రామ పంచాయతీ కార్మికుల్లో అత్యధిక మంది చదువు రాని వారు ఉన్నారని చెప్పారు. అందులోనూ అత్యధిక మందికి సొంత స్మార్ట్ ఫోన్లు లేవని పేర్కొన్నారు. పైగా ప్రభుత్వం నిర్ణయించిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పంపించగల అనుభవం అసలే లేనివారు ఉన్నారని తెలిపారు. అటువంటి వారితో తమ ఫోటోలు తామే తీసుకుని హాజరు పంపించాలని ప్రభుత్వం నిర్దేశించడం కార్మికుల జీతాలకు, ఉద్యోగాలకు ఎసరు పెట్టడమేనని చెప్పారు. ప్రభుత్వం చెప్పినట్లుగా తన ఫొటో తాను తీసుకుని పంపించకపోతే ఆ రోజంతా పని చేసినా లెక్కల్లోకి రాదని తెలిపారు. ఎందుకంటే సక్రమంగా ఫోటో పంపకపోతే ఆ కార్మికుడికి హాజరు పడదు, హాజరు పడకపోతే జీతం కట్ అవుతుందని పేర్కొన్నారు. వరుసగా 4 లేక 5 రోజులు హాజరు పడకపోతే 'పని దొంగ' కింద లెక్క గట్టి ఉద్యోగం ఊడబెరికే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కొత్త విధానం పూర్తిగా అమలయితే పండగలు, ఇతర సెలవులు కూడా అమలు కావని చెప్పారు. కార్మికులు బానిసల్లాగా పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇంతటి ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్న నూతన హాజరు విధానం కార్మికులకు ఉరితాడు లాంటిదేనన్నారు. ఈ విధానాన్ని తక్షణమే రద్దుచేసి కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాట ఫలితంగా నాటి ఉమ్మడి రాష్ట్రంలో 1999లో జిఒఎంఎస్ నంబరు 551ని నాటి ప్రభుత్వం జారీచేసిందని తెలిపారు. ఈ జిఒలో పేర్కొన్న గుర్తింపు కార్డులు, కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ పథకాలను పాలకులెవరు మారినా నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. కాని కార్మికులను వేధింపులకు గురిచేసే 'టెండర్ విధానం' మాత్రం పక్కాగా అమలు చెయ్యబడుతోందని తెలిపారు. అంటే కేవలం కార్మికులు, దళితులు, గిరిజనులు, బిసిలు, ఇతర పేదవర్గాలకు చెందిన పేదలు కావడం వల్లనే వివక్షకు గురౌతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కార్మికుల పోరాట ఫలితంగా 2019లో కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలను అమలు చేయాలని చెప్పారు. గతం నుంచి పనిచేస్తున్న కార్మికులను టెండర్లతో సంబంధం లేకుండా విధుల్లో కొనసాగించాలని, 2015లో హైకోర్టు ఇచ్చిన తీర్పు బుట్టదాకలు చేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేయటంతోపాటు చలో అసెంబ్లీ కార్యక్రమానికి కార్మి కులు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, శివ, వెంకటేష్, బాలయ్య, కొండయ్య, శారదమ్మ, అశ్వత, మేరీ, చంద్రమోహన్ పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

పట్టణ ప్రజలపై భారాలు మోపడం తగదు

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర బడ్జెట్‌లో పట్టణ ప్రజలపై బిజెపి ప్రభుత్వం భారాలు మోపడం తగని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ సంస్కరణలు, పౌర సేవలకు వివిధ రకాల రూపాలలో పన్నుల రూపంలో వసూలు, 'యూజర్ ఛార్జీల నిర్వహణ, ప్రైవేట్ సంస్థలను ఎంపిక చేసేందుకు, కేంద్ర ప్రభుత్వ విధానానికి అనుగుణంగా వైసిపి ప్రభుత్వం ఎపి అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ సంస్థను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. ప్రజలపై వేసే భారాలకు రాష్ట్ర ప్రభుత్వం వంత పాడుతోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సంస్థలను, ఎడిపి సంస్థలను, డిఎఫ్ఐఎ సంస్థలను, యుఎస్ సంస్థలను, ఎయిడ్స్ సంస్థలను పేర్లతో సహా రాష్ట్ర ప్రభుత్వాలకు రాతపూర్వక ఆదేశాలు ఇచ్చిందన్నారు. కార్పొరేషన్, మున్సిపాలిటీ కౌన్సిల్‌కు, అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధం లేకుండా, ప్రభుత్వ విభాగాలు విడగొట్టి, ప్రైవేటు సంస్థలకు అప్పగించిందని తెలిపారు. ప్రజలపై ఆస్తిపన్ను ఆధారంగా పన్నులు విధించి వసూలు దోపిడి చేయడమే కాకుండా, ప్రభుత్వ ప్రైవేటు ఖాళీ స్థలాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించి మార్టిగేజ్ చేసుకోవటానికి అనుకూలంగా స్థానిక సంస్థల పరిపాలన హక్కుల, విధుల చట్టాన్ని సవరిం చారని పేర్కొన్నారు. ఈ చట్టం లక్ష జనాభా ఉన్న ప్రతి పట్టణంలో వర్తింపజేసి అమలు చేయనున్నారన్ని అన్నారు. టైప్-టు, టైప్-త్రీ, అమృత పథకం నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు కావాలంటే, ఏ రాష్ట్రమైనా ప్రజలపై భారాలు వేసే సంస్కరణలు అమలు చేయాలని షరతులతో కూడిన నిబంధనలు ఈ బడ్జెట్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీల పేరుతో ప్రజలను భక్షించేటువంటి విధానమని, దీనిని పట్టణ ప్రజలందరూ ప్రతికటించాలని పిలుపునిచ్చారు. సిపిఎం భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, పట్టణ సంస్కరణల పన్నుల భారాలపై ప్రజా చైతన్య కార్యక్రమాలు తీసుకుని ప్రజల వద్దకు వెళ్ళనున్నామని తెలిపారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, కడప నగర కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి, ఓబులేసు, మహబూబ్ తార, గోవిందు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకే లీగ్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి-కడప


టాస్ వేస్తున్న రెడ్డిప్రసాద్

క్రికెట్ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ఉన్నత క్రికెట్‌కు ఆడించాలన్న ఉద్దేశంతోనే ప్రతి శని, ఆదివారాలలో అండర్-12, 14, 16, 19, సీనియర్ ఏజ్ గ్రూపులలో లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి రెడ్డిప్రసాద్, డిసిఒ కాజా మైనుద్దీన్ తెలిపారు. లీగ్ మ్యాచ్లలో భాగంగా శనివారం స్థానిక కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అండర్-12, 14 ఏళ్ల విభాగాల క్రీడాకారులకు మ్యాచ్ నిర్వహించారు. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో అండర్-16, 19 ఏళ్ల విభాగాల క్రీడాకారులకు లీగ్ మ్యాచ్ నిర్వహించారు. కార్యక్ర మంలో జాయింట్ సెక్రెటరీ ఎం.సాయి పృథ్వితేజ, పురుషుల ప్రతినిధి సిరాజుద్దీన్ దౌలా, సభ్యులు ముని కుమార్‌రెడ్డి, పైడికాల్వ విజయ్ కుమార్, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు. **165 పరుగులు చేసిన టీం-ఎ జట్టు :** కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో అండర్ -16, 19 ఏసు గ్రూపుల విభాగంలో నిర్వహించిన రెండు రోజుల మల్టీ డే లీక్ మ్యాచ్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీం-ఎ జట్టు 49.1 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీం -బి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది.

జాతీయ లోక్ అదాలత్‌లో 12,438 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-కడప



కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి మూర్తి

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 12,438 కేసులు పరిష్కారం చేసి రూ.7.79 కోట్లు కక్షిదారులకు నష్టపరిహారం చెల్లించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి మూర్తి, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 25 బెంచీలు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించినట్లు తెలిపారు. ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు, వైద్య, రవాణా, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గీత, సీనియర్ సివిల్ జడ్జి హేమలత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ కుమార్, సెకండ్ ఏడియం షేక్ రియాజ్, ఎక్సైజ్ మెజిస్ట్రేట్ హేమ స్రవంతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతిలాల్, న్యాయవాదులు, కచ్చిదారులు పాల్గొన్నారు.

బాల్ బాడ్మింటన్ పోటీలు ప్రారంభం

కడప అర్బన్: నగరంలోని సరోజినీ నగర్ జ్యోతి కెమికల్స్ సాయిబాబా ఆలయ సమీపంలో రాయలసీమ స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలను శనివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వి.ఎస్.అమీర్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలను టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలలో క్రీడాకారులు ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొనడం హర్షనీయమన్నారు. ఈ ఆటలకు కులమతాలు లేవని, అందరూ సమానమేనని చెప్పారు. వయస్సుతో సంబంధం లేకుండా క్రీడలను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించాలని సూచించారు. చదువులతో పాటు క్రీడా పోటీలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డి మరియు నాయకులు జలతోటి జయకుమార్, బుర్రి రెడ్డయ్య యాదవ్, లింగాల శివశంకర్ రెడ్డి, నాదెండ్ల దస్తగిరి, బండి జయ శేఖర్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

ఐటిడిపి సభ్యులను అభినందించిన చంద్రబాబు


ఐటిడిపి సభ్యులను అభినందిస్తున్న చంద్రబాబు


వల్లూరు: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఐటిడిపి సభ్యులు అభినందించడం చాలా సంతోషకరంగా ఉందని ఐటిడిపి కడప పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి నరసింహ అన్నారు. శనివారం మంగళగిరి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రబాబు ఐటిడిపి సభ్యులను ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ టిడిపి కమలాపురం నియోజకవర్గం ఇన్‌ఛార్జి పుత్తా నరసింహారెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో కడప పార్లమెంటు పరిధిలోని టిడిపి పార్టీ కార్యక్రమాలు సోషల్ మీడియా విభాగంలో యాక్టివ్‌గా పనిచేస్తున్నారని గుర్తించి ఐటిడిపి సభ్యులకు ప్రశంసా పత్రం అందించడం సభ్యులందరికీ చాలా ఆనందంగా ఉందని తెలిపారు. టిడిపి అభివృద్ధి కోసం కృషిచేసి నరసింహారెడ్డి గెలిపించుకుంటామన్నారు.

దాతల సహకారంతో అన్నదానం కొనసాగిస్తాం

పోరుమామిళ్ల: దాతల సహకారంతో రూ.5కే మదర్‌థెరిస్సా ఫౌండేషన్, చిత్తా బ్రదర్స్ ఆధ్వర్యంలో అన్నదానం కొనసాగిస్తామని చిత్తా బ్రదర్స్ విజయప్రతాప్‌రెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. రంగసముద్రం సచివాలయం వద్ద కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు. మరికొంతమంది దాతలు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో మదర్ థెరెసా ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ చిత్త గిరిప్రణీత్‌రెడ్డి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, రంగసముద్రం ఎంపిటిసిలు కల్వకూరి రమణ, మహబూబ్ పీరా, మాల కొండయ్య, తులసి, హ్యూమన్ రైట్స్ గంగన్న, సురేష్, పాపయ్య, రవి, ప్రసాద్, కిషోర్, మురళి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎఎఫ్‌యూ విసిగా ఆంజనేయ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

కడప అర్బన్ : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా శనివారం ప్రొఫెసర్ ఆంజనేయ ప్రసాద్ బాధ్యతలు స్వీరించారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంజనేయప్రసాద్

జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ హైదరాబాద్ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈయన్ను వైస్ ఛాన్సలర్‌గా నియమిస్తూ ఉన్నత విద్యా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలి సిందే. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ యూనివర్సిటీ మొట్టమొదటి వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు తీసుకోవడానికి నా మీద ఇంత బాధ్యత పెట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. యూనివర్సిటీ అభివృ ద్ధికి నిరంతరం శ్రమిస్తానని, అందరి సహాయ సహకారాలతో యూనివర్సిటీని ప్రగతి పథంలో ముందుకు తీసుకుని వెళ్తానని చెప్పారు. **శుభాకాంక్షలు వెల్లువ :** విసి ఆంజనేయ ప్రసాద్‌ను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఇసి సురేంద్రనాథ్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ హైదరాబాద్ ప్రొఫెసర్లు, కుటుంబ సభ్యులు, వైవీయూ రిజిస్టర్ వెంకటసుబ్బయ్య, ఎస్వీ యూనివర్సిటీ అధ్యాపకులు, వైఎస్ఆర్ఎఎఫ్‌యు డిప్యూటీ రిజిస్టర్ రాజేష్ కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ పవన్ కుమార్‌రెడ్డి సత్కరించారు.

అస్సాలిహాత్ స్కూల్‌లో సైన్స్ ఫెయిర్

కడప అర్బన్ : నగరంలోని రవీంద్రనగర్‌లోని అస్సాలిహాత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శనివారం ఘనంగా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముక్తార్ అహ్మద్, చైర్మన్ అక్బర్ అలీ, డైరెక్టర్ ఇషాక్‌అలీ, డిపిసి కన్వీనర్ బాబు బాయ్, రూట రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే విద్యార్థులు చదువుతో పాటు మేధో శక్తి పెంచుకోవడానికి సైన్స్ ఫెయిర్లు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అబ్బుర పరిచే విధంగా సైన్స్ ఫెయిర్‌లో తమ ప్రతిభతో విద్యార్థులు తయారు చేసి వాటి గురించి అవగాహన పరచడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ మునీర్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తకాలతోనే మేధోవికాసం

- పుస్తకా విష్కరణ సభలో రిటైర్డ్ ఎస్‌పి రాజకిషోర్ బాబు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పుస్తకాలను చదవడం ద్వారా మేధోవికాసం సాధ్యమని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డు ఎస్‌పి రాజకిషోర్‌బాబు పేర్కొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

శనివారం నగరంలోని ఎర్రముక్కపల్లిలోని దూదేకుల భవన్‌లో ఉపాధ్యాయులు సుభాన్ అధ్యక్షతన రిటైర్డు లెక్చరర్ కే.శేడి.ఇమామ్ సాహెబ్ రచించిన సూక్తి రత్నావళి పుస్తకా విష్కరణ సభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాయాజాలంలో పడి పుస్తకాలను విస్మరించడం దుష్పరి ణామాలకుదారి తీసేఅవకాశం ఉందన్నారు. విద్యావంతులైన తల్లిదండ్రులు పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని తెలిపారు. పుస్తక విజ్ఞానం ద్వారానే కార్ల్‌మార్క్స్, అంబేద్కర్ ప్రపంచ ప్రఖ్యాతులుగా మారిన వైనాన్ని గుర్తుచేశారు. దూదేకుల సంఘం నాయకత్వం సైతం పుస్తక పఠనం వైపు మళ్లాలని పిలుపునిచ్చారు. రాజంపేటకు చెందిన దూదేకుల సంఘం నాయకులు ఇమామ్ దూదేకుల భవన పైఅంతస్తు నిర్మాణానికి రూ.2 లక్షలు, రాయచోటికి చెందిన టీచర్ సిద్ధయ్య 100 బస్తాల సిమెంట్, వై.అజ్మతుల్లా రూ.25 వేలు సహా నలుగురు రూ.10 వేలు చొప్పున విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు సిద్ధయ్య, ఓబులేసు, రాజంపేటకు చెందిన కాంట్రాక్టర్ ఇమామ్, మాజీ కౌన్సిలర్ ఫకృద్దీన్, సుభాన్, రిటైర్డు ప్రిన్సిపాల్ మస్తాన్, ఖాదరయ్య, ఉపాధ్యాయులు అజ్మతుల్లా, రిటైర్డు ఇంజినీర్ భరత్, జడ్‌పి రిటైర్డు డిప్యూటీ సిఇఒ వెంకటప్రసాద్, రిటైర్డు ఎస్ఐ సుబ్రమణ్యస్వామి పాల్గొన్నారు.

రామచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-బద్వేలు

అధికార పార్టీ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎం.వి.రామచంద్రారెడ్డి ఓట్ల కోసం బద్వేల్ పట్టణంలో ఉన్న ప్రయివేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులకు టిఫిన్ బాక్సులు పంపిణీ చేయడం ఎన్నికల కోడ్ ఉల్లంగించిన ఆయనపై ఎన్నికల కమిషనర్ కఠినమైన చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. శనివారం డివైఎఫ్ఐ బద్వేల్ నాయకుల సమావేశం రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాగైనా గెలవాలనే ఆలోచనతో అధికార పార్టీకి చెందిన అభ్యర్థి ఉపాధ్యాయులను లోబరుచుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన అభ్యర్థిపై కేసు నమోదుచేసి ఎన్నికలలో పోటీ చేయకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ నాయకులు ప్రవీణ్ కుమార్, జి.నాగార్జున, మస్తాన్ షరీఫ్, ఫయాజ్, ప్రసాద్ పాల్గొన్నారు.

వైసిపి జిల్లా కార్యాలయానికి భూమిపూజ

కడప: నగరంలోని మేడా కన్వెన్షన్ సెంటర్ ఎదురుగా నూతనంగా నిర్మించబోతున్న వైసిపి జిల్లా పార్టీ కార్యాలయంనకు భూమిపూజ కార్యక్రమం శనివారం ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాద్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ నిర్వహించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు సుబ్బారెడ్డి, చైర్మన్లు పులి సునీల్, కరీముల్లా, నాగయ్య, సలహాదారు ప్రసాద్‌రెడ్డి, అన్ని డివిజన్ల గౌరవ కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అనాథశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-కడప అర్బన్



అన్నదానం చేస్తున్న బాదుల్లా

ఆదరణ నిరాశ్రయుల అనాధాశ్రమంలో కళాకారుడు, నటుడు, నంది అవార్డు గహిత వైస్ సిలార్ ప్రథమ వర్ధంతి సందరరేగా ఆయన కుమారుడు వైఎస్ సాయిబాబా ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు సుంకేసుల బాదుల్లా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిలార్ అనేక నాటకాలు, మేకప్ మెన్ సేవలు ఆజరామరణం నిలుస్తాయని ప్రసంచించారు. అయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తన్నానని తెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు హామీద్ బుకారి, శివారెడ్డి, నిజాం, రఫీ పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు అడ్డంకులు సరికాదు

కడప అర్బన్: టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ప్రభుత్వం అడ్డంకులు సృష్టించడం సరికాదని పోలీట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి విమర్శించారు. శనివారం గాయత్రి టవర్స్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్రకు వస్తున్న జనాలను చూసి సిఎం జగన్మోహన్‌రెడ్డి గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయని చెప్పారు. ప్రభుత్వంపైన ప్రజల నుంచి తీవ్రమైన వ్యతిరేకత పాదయాత్రలో స్పష్టంగా కనిపిస్తా ఉందని పేర్కొన్నారు. టిడిపి మళ్లీ అధికారంలోకి వస్తుందని భయంతో వైసిపి నేతల ప్యాంట్లు తడిసిపోతున్నాయని విమర్శించారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఒక టీంని ఏర్పాటు చేసి డ్రోన్ కెమెరాల ద్వారా జనాలు లేరని ఫెక్ వీడియోను సృష్టించి ప్రజల్లోకి వదిలే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. లోకేష్ పాదయాత్ర జిల్లాలో కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా 'సెయింట్ ఆంటోనీస్' 20వ వార్షికోత్సవం

కలసపాడు : సెయింట్ ఆంటోనీస్ ఇంగ్లీషు మీడియం పాఠశాల 20వ వార్షికోత్సం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ డిసి గోవింద్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాపరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ సగిలి సుదర్శన్, ఎంపిపి బోధనబోయిన నిర్మల నారాయణ, జడ్‌పిటిసి అంకన గురివిరెడ్డి, కొత్తకోట సహకార సొసైటీ బ్యాంకు చైర్మన్ పెద్దిరెడ్డి పురుషోత్తంరెడ్డి, మాజీ ఎంపిపి రాజుపాలెం సర్పంచ్, సుధా రామకృష్ణారెడ్డి, పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీ సర్పంచ్, చిత్త రవి ప్రకాష్‌రెడ్డి, ఓఎల్ఎఫ్ ప్రధానోపాధ్యాయురాలు చిత్తా మరియరాణి, వైసిపి యూత్ నాయకులు ప్రణీత్ రెడ్డి, పాఠశాల చైర్మన్, చిత్త,బాలిరెడ్డి జయమ్మ, పాఠశాల కరస్పాండెంట్ చిత్త రాజశేఖర్ రెడ్డి, ప్రిన్సిపల్, ప్రభా వతి, సర్పంచ్ శివ లీల, ఎంపీటీసీ, షరీఫ్, ఉపాధ్యా యులు, తల్లిదం డ్రులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ గోవింద్‌రెడ్డి

ప్రజల దృష్టికి ప్రభుత్వాల వైఫల్యాలు

పోరుమామిళ్ల టౌన్: రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు అనుసంధానంగా దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాలు, జిల్లాలు, నియోజకవర్గాల్లో, హాత్ సే హాత్ జోడో అభియాన్ అనే కార్యక్రమాన్ని మార్చి 26 వరకు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నిర్ణయించింది. ఇందులో భాగంగా మన రాష్ట్రంలో ఈ కార్యక్రమాన్ని పిసిసి, డిసిసి ఆదేశాల మేరకు జమ్మలమడుగు నియోజకవర్గ సమన్వయకర్తగా పోరుమామిళ్లకు చెందిన డాక్టర్ అన్వర్‌ను నియమించింది. ఈ సందర్భంగా శనివారం అన్వర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. రాహుల్ గాంధీ సందేశాన్ని ప్రజలకు చేరువయ్యేలా చేస్తామన్నారు. నియోజ కవర్గంలో హాత్‌సేహాత్ జోడో అభియన్ యాత్రను విజయవంతం చేస్తానని పేర్కొన్నారు.

సమరభేరి!

ప్రజాదృష్టి

ఇటీవలి వారంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు సమరశంఖం పూరించారు. 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో కోరుతూ కడప, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ల ఎదట నిరసన ప్రదర్శనలకు దిగడం తెలిసిందే. తమకు 2017 నవంబర్‌లో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిపక్ష హోదాలో అంగన్వాడీలకు మెరుగైన వేతనాలు, ఇతర సదుపాయాలను కల్పిస్తామని హామీలిచ్చి, సెల్ఫీలు తీయించుకున్న ఘటనను గుర్తు చేయడం ప్రభుత్వ విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేసింది. తాము అధికారంలోకి వస్తే తెలంగాణాలోని అంగన్వాడీల కంటే మెరుగైన వేతనాలు, ఇతర సదుపాయాలను కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలదీయడం గమనార్హం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం సవాల్‌గా మారిందని చెప్పవచ్చు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు ఉపాధ్యాయుల రుసరుసలు మరోవైపు అంగన్వాడీల నిరసన ప్రదర్శనలతో ప్రభుత్వానికి ఊపిరి ఆడని పరిస్థితి ఏర్పడింది. ఇదేపట్టుదలతో అంగన్వాడీలు ఉద్యమాన్ని కొనసాగిస్తే ఇచ్చిన హామీలను నెరవేర్చుకునే అవకాశం ఉందని చెప్పవచ్చు. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు ఏడు వేల మంది వరకు అంగన్వాడీలు ఉన్నట్లు అంచనా.ఇదేతరహాలో అన్నమయ్య జిల్లాలోనూ ఉన్నారు. దేశంలో పిల్లలు, మహిళల్లో రక్తహీనత, గ్లుకోమా వంటి వ్యాధులకు అంగన్వాడీ వర్కర్లు పౌష్టికాహారాన్ని అందిస్తూ సమాధానంగా నిలిచిన సంగతి తెలిసిందే. దేశంలోనే గుజరాత్ తదితర రాష్ట్రాలు అధ్వాన్న రేటులో కునారిల్లుతున్న దశలో రాష్ట్రంలో కొనుగోలు శక్తి ఆధారంగా జిఎస్‌డిపి రేటు మెరుగైన స్థితిలో నిలవడానికి గల కారకుల సేవలను గుర్తించాల్సిన అవసరం ఉంది. అంగన్వాడీలతో ప్రభుత్వం తమ సంక్షేమ పథకాల ప్రచారం మొదలుకుని సర్వేలు, సాధికారితా గుర్తింపు వరకు ఉపయోగించుకుంటున్న సంగతి తెలిసిందే. కరోనా సమయంలోనూ రోగులకు మందులు సరఫరా చేయడంలో విశేష కృషి చేశారు.ఇటువంటి క్షేత్రస్థాయి సిబ్బంది న్యాయమైన సమ స్యలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల సీజన్ మొదలైన నేపథ్యంలో ఉద్యమకారులు శక్తివంచన లేకుండా సమరశంఖం పూరిస్తేనే సత్ఫలితాలు సాధించే అవకాశాలు ఉన్నాయని చెప్పుకోవచ్చు. లేనిపక్షంలో మరో సార్వత్రిక ఎన్నికల వరకు నిరీక్షించాల్సి వస్తుందనడంలో సందేహం లేదు. తస్మాత్ జాగ్రత్త అని గుర్తుంచుకోవాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి


జడ్‌పిటిసికి సమస్యలు విన్నవిస్తున్న ఎస్‌టి కాలనీవాసులు

మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు హామీ

ప్రజాశక్తి - వేంపల్లె


మండలంలోని కుమ్మరాంపల్లె పంచాయతీ ఎస్‌టి కాలనీలో మినీ అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ఆ గ్రామంలో జరిగిన ఓ శుభ కార్యక్రమానికి జడ్‌పిటిసి, సర్పంచు మునేష్ హాజరయ్యారు. అనంతరం వారు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు మినీ అంగన్వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులను కోరారు. ఇక్క ఉన్న గృహాలు వర్షాలకు ఉరుస్తున్నాయని, మరమ్మతులు చేయించాలని కోరారు. ఇళ్ల మరమ్మతులు చేసుకొనేందుకు ఏప్రిల్‌లో ఒక్కో ఇంటికి రూ.30 వేలు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆయా ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు విద్యుత్ శాఖ జెఇ శివనాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టేందుకు కొన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మండలంలోని 33/11 కెవి సబ్‌స్టేషన్‌కు అలిరెడ్డిపల్లి, వీరన్నగట్టుపల్లె, టి.వెలమవారిపల్లె, అయ్యవారిపల్లె సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

చక్రాయపేట : మండలలోని నాగులగుట్టపల్లె, కె.ఎర్రగుడి, సిద్దారెడ్డిగారిపల్లె సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8.30నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎఇఇ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని రైతులు, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తవ్వా వెంకటయ్య

తెలుగు భాషాభివృద్ధికి కృషి : తవ్వా

ప్రజాశక్తి - చాపాడు

తెలుగు భాషాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అధికార భాషా సంఘం సభ్యులుగా నూతనంగా ఎంపికైన తెలుగు రచయిత తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి నివాసంలో శనివారం ఆయన ఎమ్మెల్యేను సన్మానించారు. ఈ సందర్భంగా తవ్వా వెంకటయ్య మాట్లాడుతూ అధికార భాషా సంఘం సభ్యులుగా తనకు అవకాశం రావడానికి ఎమ్మెల్యే, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారం మరువలేనిదని తెలిపారు. కార్యక్రమంలో మూల మల్లికార్జునరెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

స్పర్శలేని మచ్చలుంటే వైద్యుడిని సంప్రదించాలి

ప్రజాశక్తి - చాపాడు

శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే వైద్యుడ్ని సంప్రదించాలని హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి తెలిపారు. మండల పరిధిలోని లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల సందర్భంగా శనివారం వైద్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం కుష్టు వ్యాధి నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తోందన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు జవహర్ మునీర్, ఎంపి హెచ్‌ఒ, ఎఎన్ఎం కీర్తి, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



వృద్ధులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న సిఐ

అభాగ్యులను ఆదుకోవడం సంతోషకరం

- రూరల్ సిఐ మధుసూదన్ గౌడ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

తాము సంపాదించిన మొత్తంలో కొంత వెచ్చించి అభాగ్యులను ఆదుకోవడం సంతోషకరమని రూరల్ సిఐ ముధసూదన్ గౌడ్ తెలిపారు. స్థానిక రూరల్ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమానికి ఆర్‌కె హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ సహకారంతో, మీకోసం సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రూ.20 వేల విలువ చేసే నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ మధుసూదన్‌గౌడ్ మాట్లాడుతూ ఆర్‌కె హెల్పింగ్ హ్యాండ్స్ కువైట్ వారు తమ జీవనోపాధి కోసం, ఇతర దేశాలకు వెళ్ళి జీవిస్తున్నారని తెలిపారు. వారి సంపాదనలో కొంత మొత్తాన్ని తమ మాతృభూమికి ఏదైనా చేయాలనే ఉద్దేశ్యం మంచిదన్నారు. సభ్యులందరూ ప్రతినెలా తమ సంపాదనలో కొంత సొమ్ము పోగుచేసుకుని, నిరాశ్రయులను, అభాగ్యులను ఆదుకోవడం గొప్ప విషయమన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని కొన్ని ఆశ్రమాలకు ప్రతి నెలా కొంతమొత్తంలో నిత్యావసర వస్తువులు, ఆశ్రమానికి కావాల్సిన ఇతర ఏదైనా వస్తువులు సహాయం చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు వారు మరెన్నో చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాపార వేత్త వేములపాటి సూర్యనారాయణరెడ్డి, మీకోసం సేవా సంస్థ అధ్యక్షుడు పుల్లగూర విష్ణువర్ధన్, ఆదరణ సేవా సంస్థ బైసాని సత్యనారాయణ, అమ్మ సేవా సమితి శివ శంకర్, ప్రొద్దుటూరు మదర్ థెరీసా సేవా వృద్ధాశ్రమం కంచేన రాజేష్, నిర్వాహకులు పోలిచెర్ల సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు


మూడేళ్ల క్రితం చాపాడులో వేసిన సిమెంట్ రోడ్డు


ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు మూడేళ్లుగా బిల్లులు అందలేదు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారం చేపట్టిన తర్వాత కొంతకాలం పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగింది. పంచాయతీ ఎన్నికలకు ముందు ఎమ్మెల్యేలు సూచించిన వారికి గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని అప్పగించారు. ఈ పనులు చేపట్టి మూడేళ్లు పూర్తయినా నేటికీ బిల్లులు సగానికిపైగా రావాల్సి ఉంది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.78.75 లక్షలతో 28 పనులు ఉపాధి హామీలో చేపట్టారు. వీటికి సంబంధించి 50 శాతం వరకు మాత్రమే నిధులు మంజూరయ్యాయి. చాలావరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో రోడ్డు నిర్మాణం చేపట్టిన నాయకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పనులకు సంబంధించి ఎంబుక్‌లు సిద్ధం చేయడానికి మాత్రం సంబంధిత పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ప్రారంభంలోనే తమ వాటాను ముక్కు పిండి రాబట్టుకున్నారని నాయకులు ఆరోపిస్తున్నారు. బిల్లులతో తమకు సంబంధం లేదని ఎం బుక్ సిద్ధం చేసేంతవరకే మా పని అని సూచించి వారు తమ చేతి వాటం ప్రదర్శించడం, వాటా అప్పజెప్పక పోతే చేసిన పనికి ఎంబుక్‌లు సిద్ధం చేయకుండా కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది. ట్రెజరీలో టోకన్ వెనుక పడుతుందని తొందరపడి కమీషన్లు ముట్టజెప్పినట్లు సమాచారం. బిల్లులు రాక ఒకవైపు, ఎంబుక్‌లు సిద్ధం చేసుకునేందుకు అధికారులకు వాటాలు అప్పజెప్పినందుకు మరొకవైపు కాంట్రాక్టర్లు, నాయకులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. చాపాడు ఎస్‌సి కాలనీలో రూ.8.52 లక్షలతో 2019 జూలై నెలలో ఉపాధి హామీ పథకం ద్వారా సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ పనికి సంబంధించి ఏప్రిల్ 2020లో రూ.1.04 లక్షలు, 2021 ఫిబ్రవరిలో రూ.2 లక్షలు మంజూరైంది. కొంత మెత్తం ఉపాధి కూలీల ఖాతాల్లో కూడా జమ అయింది. ఇంకా రూ.3.30 లక్షలు మంజూరు కావాల్సి ఉంది. ఇలాంటి పనులు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో చేశారు. వీటికి సంబంధించి రూ.లక్షల్లో పెండింగ్ బిల్లులు కాంట్రాక్టర్లకు అందాల్సి ఉంది. ప్రభుత్వం రేపుమాపు అంటూ కాలయాపన చేస్తుండడం అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొంతమంది భూములు, వారి కుటుంబ సభ్యుల బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి వడ్డీలు చెల్లించి కుంగిపోతున్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ జరుగుతుంటే కాంట్రాక్టర్లు వాటి వివరాలను తెలిపేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో ఉపాధి సిబ్బందికి, పంచాయతీరాజ్ అధికారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిధులు మంజూరు చేసేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎగువ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమ ఎడారి

ప్రజాశక్తి - వేంపల్లె


కర్ణాటక నిర్మిస్తున్న ఎగువ భద్ర ప్రాజెక్టుతో రాయలసీమ ఎడారి కాక తప్పదని పిసిసి మీడియా చైర్మన తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఎగువ భద్ర ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ ప్రాంతంలోని తుంగభద్ర హై లెవల్ కెనాల్, లో లెవల్ కెనాల్, కెసి కెనాల్ ప్రాజెక్టులు నిరుపయోగంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంతంలో 8 లక్షల ఎకరాల సాగు భూమి బీడుగా మారనుందని తెలిపారు. నికర జలాల కేటాయింపు లేకుండానే కర్ణాటక ప్రభుత్వం 29.5 టిఎంసి సామర్థ్యంతో 6 లక్షల ఎకరాలకు నీరు అందించేలా ఎగువ భద్ర ప్రాజెక్టును నిర్మిస్తోందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎగువ భద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి, 2023-24 బడ్జెట్‌లో రూ.5300 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఇంత జరుగుతున్నా జగన్ ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు ఉండడం శోచనీయమన్నారు. సీమ పట్ల ఏ మాత్రం ప్రేమ ఉన్నా జగన్ ప్రభుత్వం వెంటనే సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసి, సమర్థ వాదనలు



నది జలాల గురించి మ్యాప్ ద్వారా వివరిస్తున్న తులసిరెడ్డి

వినిపించాలన్నారు. తద్వారా కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అప్పర్ భద్ర ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించిందని విమర్శించారు. ఈ ప్రాజెక్టును అడ్డుకోకపోతే రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమ ప్రజలు, రైతులు జగన్ పార్టీని చిత్తుగా ఓడిస్తారని ఆయన తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.5 లక్షలు విరాళం


ముకుందారెడ్డికి విరాళం అందజేస్తున్న దాత మోడెం వీరాజనేయ ప్రసాద్

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని గండి శ్రీవీరాజంనేయస్వామి దేవస్థానం పరిధిలోని నిత్యానన్నదానానికి దాత రూ.5,00116 విరాళం ఇచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి తెలిపారు. శనివారం రాష్ట్ర తొగట వీర క్షత్రియ సంఘం అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ తన తల్లి జయమ్మ (చిన్న మండెం జడ్‌పిటిసి) తండ్రి దివంగత చిన్నప్ప (టీచర్) పేరు మీద ఈ విరాళాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందారెడ్డి, చైర్మన్ పిపుపోలు రాఘవేంద్రప్రసాద్‌కు అందజేశారు. అనంతరం దాత మోడెం వీరాజనేయ ప్రసాద్‌ను ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వామివారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. సత్కరించారు. నిత్యాన్నదానానికి విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందని మోడెం వీరాంజనేయ ప్రసాద్ తెలిపారు. నిత్యన్నదానం కార్యక్రమం విజయవంతం కావడానికి తన బంధు, మిత్రుల ద్వారా మరింత సహకరిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో దాత సమీప బంధువు రామచంద్ర పాల్గొన్నారు.

సత్ఫలితాలిస్తున్న డిజిటల్ బోధన విధానం : డిఇఒ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సర్కారు బడుల్లో విద్యార్థులకు డిజిటల్ విధానంలో బోధన అందించే ప్రక్రియ సత్ఫలితాలిస్తోందని డిఇఒ దేవరాజు పేర్కొన్నారు. శనివారం తాళ్లమాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఇందులో భాగంగా 8వ తరగతి పిల్లలకు బై జ్యూస్ ట్యాబ్‌ల గురించి, వాటి ప్రయోజనం గురించి వివరించారు. పిల్లలు ఆ ట్యాబ్ లు ఎలా ఉపయోగిస్తున్నారు.. వాటి వల్ల ప్రయోజనం ఎలా ఉంది అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ ఎంపిక చేసిన పాఠశాలల తరగతి గదుల్లో డిజిటల్ స్క్రీన్లు ద్వారా డిజిటల్ విద్యాబోధన జరుగుతోందన్నారు. ఈ ట్యాబ్ ద్వారా మరింత చదువుకోవడానికి వీలుంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు డిజిటల్ టెక్నాలజీ విద్యతో మరింత రాణించే అవకాశం ఉందన్నారు. పిల్లలకు పాఠశాల స్థాయి నుంచే డిజిటల్ విద్యా బోధన అందించాలని ప్రభుత్వం సంకల్పించడంపై విద్యార్థులు, తల్లి దండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పాఠశాలలో టిఎఆర్ఎల్,


మాట్లాడుతున్న డిఇఒ దేవరాజు

ఎల్ఎపి జరుగుతున్నాయా లేదా అని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.గోపినాథరెడ్డి, ఉపాధ్యాయులు, సిఆర్‌పి యస్.భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

భూములపై సంయుక్త సర్వే నిర్వహించాలి


మాట్లాడుతున్న ఖాజామోహిద్దీన్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జామియా మసీదు భూములపై సంయుక్త సర్వే నిర్వహించి, ఆక్రమణలపై నిగ్గు తేల్చాలని విశ్రాంత రైల్వే ఉద్యోగి, ముస్లిం నాయకులు ఖాజామోహిద్దీన్ కోరారు. స్థానిక జామియా మసీదులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాల్టీ, రెవెన్యూ, వక్ఫ్‌బోర్డు మూడు ప్రభుత్వ శాఖలు సర్వే నిర్వహించి 6.90 ఎకరాలు ఏమైందనే వాస్తవాలు బయటి ప్రపంచానికి తెలియజేయాలని కోరారు. ప్రొద్దుటూరు అంజుమన్ అహ్లె ఇస్లాంను మోసం చేస్తూ వస్తున్నారని, 56 సర్వే నివేదికలో అంజుమన్ ఇస్లాం వచ్చేచోట స్టిక్కర్ అతికించి ఆ పేరు కనిపించని విధంగా కొందరు మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపించారు. జామియా మసీదును 1956లో అంజుమన్ అహ్లెఇస్లాం నిర్వాహకులే కాపాడారని ఆయన గుర్తు చేశారు. 1862లో ఏర్పాటైన ఈ మసీదును 1992లో మసీదు కమిటీ అధ్యక్షుడు బేపారి బషీర్ అహ్మద్ ఆధ్వర్యంలోనికి వెళ్లిందన్నారు. ఈ మసీదుకు చెందిన 7.50ఎకరాల్లో 0.60 ఎకరాలకు చెందిన భూమి కోర్టులో వాజ్యం నడుస్తోందని, ఇది మినహాయించి 6.90 ఎకరాల విషయం నిగ్గు తేల్చాలన్నారు. వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా షాదీఖానాను లీజ్‌కు ఇచ్చారని ఆరోపించారు. మసీదు భూములను వక్ఫ్ బోర్డు స్వాధీనం చేసుకోవాలని 2022లో బేపారి బషీర్ అహ్మద్ కుమారుడు బేపారి జాకీర్ అహ్మద్ రాసిచ్చినట్లుగా తెలిపారు. మసీదు ఆస్తులను దుర్వినియోగం చేశారన్నారు. ఈ నెల 14న స్టేట్ మైనార్టీ కమిషన్ ఎదుట వాయిదా ఉందన్నారు. రూ.15లక్షల వక్ఫ్ నిధుల దుర్వినియోగంపై, వక్ఫ్‌బోర్డు చట్టాలకు వ్యతిరేకంగా షాదిఖానా నిర్వహణపై, రూ.20లక్షల ఆస్తిని రూ.38లక్షలకు కొనుగోలుపై కమిషన్ విచారణ చేపట్టిందని ఖాజామోహిద్దీన్ వివరించారు. సమావేశంలో షాహుల్‌బాషా, ఉప్పలూరు బాషాజాన్, ఇక్బాల్ హుశేన్ (మసీదుల్) పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయకపోవడం శోచనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోవడం శోచనీయమని ఎపి డిఎస్‌సి కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగులు జెఎసి రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య ఆరోగ శాఖలో 20ఏళ్లుగా కాంట్రాక్టు విధానంలో మగ్గుతున్న పారా మెడికల్ సిబ్బందిని రెగ్యులర్ చేయకపోవడం దారుణమన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 సంవత్సరాలు అవుతున్నా సానుకూల నిర్ణయం తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి బోత్స సత్యనారాయణ డిసెంబర్ చివరి కల్ల రెగ్యులర్ ప్రక్రియను పూర్తి చేస్తామని ప్రకటించినా అమలుకు నోచుకోలేదన్నారు. రెగ్యులర్ చేసే అంశంపై నియమించిన మంత్రివర్గ కమిటీ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ విరమణ కాలం దగ్గర పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్నట్లు ప్రకటించారని, అలాగే ఎపిలో కూడా చేసేలా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలోని అటెండర్ నుండి ఐఎఎస్ వరకు రెగ్యులర్ విధానంలోనే ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు.

చిలంకూరులో అన్నదానం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని చిలమకూరు గ్రామంలో శనివారం అన్నదానం ఏర్పాటు చేశారు. శివమాల ధరించిన స్వాములు మండల దీక్ష పూర్తి చేసుకున్న సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నప్రసాదాలు వడ్డించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు బాల వెంకటరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

వైభవంగా రంగనాథ స్వామి రథోత్సవం

- ఆకట్టుకున్న సంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి పులివెందుల రూరల్


పురవీధుల్లో సాగుతున్న రథోత్సవం

స్థానిక శ్రీ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించిన రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. పూజా కార్యక్రమంలో పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి, డిఎస్‌పి శ్రీనివాసులు, పుర పాలక ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, పురపాలక చైర్మన్ వల్లెపు వరప్రసాద్, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, రంగనాథ స్వామి గుడి చైర్మన్ సుధీకర్‌రెడ్డి, అంకాలమ్మ గుడి చైర్మన్ ప్రసాద్ పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి రథోత్సవం ప్రారంభమైంది. రథోత్సవం ముంగిట వివిధ రకాల నృత్యాలు, వివిధ రకాల పాటలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పులివెందుల అర్బన్ సిఐ రాజు పర్యవేక్షణలో ఎస్ఐలు చిరంజీవి, హుస్సేన్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నేలకూలిన వందేళ్ల మర్రిచెట్టు



ప్రజాశక్తి - ముద్దనూరు

ఎందరికో నీడనిచ్చి, ఆహ్లాదకర వాతావరణాన్ని అందించిన వందేళ్లు చరిత్ర కలిగిన మర్రిచెట్టు శనివారం మధ్యాహ్నం నేల కొరిగింది. మండలంలోని ఓబుళా పురం ప్రాథమిక పాఠశాల సమీ పంలో ఈ మర్రిచెట్టు కూలిందని స్థానికులు కృష్ణారెడ్డి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

రెడ్యం పరామర్శ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామానికి చెందిన ఇండ్ల రామసుబ్బారెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై కడప రిమ్స్ సర్జికల్ ఐసియూలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర సీనియర్ నేత, ఎపిఎస్ ఆర్‌టిసి మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి శనివారం పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. త్వరగా కోలుకోవాలని రెడ్యం ఆకాంక్షించారు.



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా ఉద్యమాలను బలపరచండి : సిపిఎం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజావ్యతిరేక విధానాలను అవలంభించే ప్రభుత్వాల పట్ల నిరసనలు తెలిపేందుకు, కార్యోన్ముఖుల్ని చేసేందుకు సిపిఎం ఉద్యమానికి విరాళాలిచ్చి ప్రజా ఉద్యమాలను బలపరచాలని సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి సత్యనారాయణ కోరారు. శనివారం సాయంత్రం పట్టణంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలవారి సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సిపిఎం ఉద్యమాభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. ప్రతి మూడు సంవత్సరాలకోమారు స్థానిక సిపిఎం శాఖ నుండి అఖిలభారత స్థాయి వరకు మహాసభలు జరుపుకొని ప్రజా సమస్యలను చర్చించి, వాటి పరిష్కారానికి కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. భవిష్యత్‌లో చేపట్టనున్న ప్రజా ఉద్యమాలకు ఆర్థిక సహకారం అందించాలని ఆయన కోరారు. కరోనా సమయంలో అనేక రూపాల్లో కార్యక్రమాలు చేపట్టి ప్రజల వెన్నంటి నిలిచామన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఓబులేసు, శేఖర్, బాలసుబ్బయ్య, ఎస్ఎఫ్ఐ నాయకుడు నరసింహ పాల్గొన్నారు.

స్నేహపూర్వకంగా మెలగండి

- జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకున్న వారు స్నేహపూర్వకంగా మెలగాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ సూచించారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా జడ్జి మాట్లాడుతూ రాజీమార్గంలో వివిధ రకాల కేసులు పరిష్కరించుకునేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. స్వేచ్ఛాహితమైన జీవితానికి చక్కటి మార్గం లోక్ అదాలత్ చూపుతుందన్నారు. దీన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన జమ్మలమడుగు డిఎస్‌పి నాగరాజును, బార్ అసోసియేషన్ సభ్యులను, బ్యాంకు మేనేజర్లను ప్రశంసించారు. లోక్ అదాలత్ ద్వారా అన్ని రకాల కేసులు కలిపి 706 పరిష్కరించబడ్డాయన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి నాగరాజు, న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు కానిస్టేబుల్, కోర్టు సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : శనివారం ప్రొద్దుటూరు కోర్టులో నిర్వహించిన జాతీయలోక్ అదాలత్‌లో 550 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. మొదటి


పరిష్కారపత్రాన్ని అందుకుంటున్న బాధితులు

బెంచ్‌లో సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి రమేష్ యం.వి.ఒ.పి 21 కేసులు, సివిల్‌కు సంబంధించి 18 కేసులు పరిష్కరించారు. వీటి విలువ రూ.3కోట్ల 64లక్షల32వేలు అన్నారు. రెండవ బెంచ్ సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్ యాదవ్ సివిల్‌కు చెందిన తొమ్మిది కేసులు వీటి విలువ రూ.90లక్షల 20వేల 929 పరిష్కరించారు. మూడవ బెంచ్ న్యాయమూర్తి రత్నప్రసాద్ సివిల్, క్రిమినల్ ఎన్ఐ యాక్టు 26 కేసులు వీటి విలువ రూ.కోటి 23లక్షల 22వేల 521లు, నాలుగో బెంచ్ న్యాయమూర్తి హారిక క్రిమినల్, ఎన్ఐ యాక్ట్ కేసులు 130 వీటి విలువ రూ.3కోట్ల 60లక్షల 86వేల 614లు, ఐదో బెంచ్ న్యాయమూర్తి అనిల్‌కుమార్ నాయక్ క్రిమినల్ ఎన్ఐ యాక్ట్ కేసులు 101 వీటి విలువ రూ.43లక్షల 34వేల710లు, బెంచ్ క్యూట్ ఎస్‌టిసి కేసులు 236 వీటి విలువ రూ.69వేల 8వందల 50 అని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు బి.ఓబులేసు, సోషల్ వర్కర్ శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, జి.నిర్మలాదేవి, యం.లతా, బి.రాజశేఖర్, ఫిరోజ్, రమేష్‌కుమార్, ఇన్సూరెన్స్ నిర్వాహకులు, బార్ సభ్యులు వెంకటహరి, జి.శ్రీనివాసులు, రియాజ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

- టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫమైందని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మనోజీరావు వీధిలో శనివారం ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. వైసిపి పాలన అప్పులు తీసుకురావడంలో తప్ప, అభివృద్ధిలో వైఫల్యం చెందిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలేమైనాయని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో షబ్బీర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, మెరువా మూర్తి, లీగల్ సెల్ జిల్లా సెక్రెటరీ వినోద్‌కుమార్, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షుడు తమ్మిశెట్టి సురేంద్ర, టిఎన్‌టియుసి పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి శ్రీనివాసులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

www.prajasakti.com

ప్రజాశక్తి


ఆదివారం 12 ఫిబ్రవరి 2023

5

అన్నమయ్య



ఎఫ్‌యూ విసిగా ఆంజనేయ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఆంజనేయప్రసాద్

కడప అర్బన్ : డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా శనివారం ప్రొఫెసర్ ఆంజనేయ ప్రసాద్ బాధ్యతలు స్వీరించారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ హైదరాబాద్ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఈయన్ను వైస్ ఛాన్సలర్‌గా నియమిస్తూ ఉన్నత విద్యా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలి సిందే. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ యూని వర్సిటీ మొట్టమొదటి వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు తీసుకోవడానికి నా మీద ఇంత బాధ్యత పెట్టిన ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. యూనివర్సిటీ అభివృ ద్ధికి నిరంతరం శ్రమి స్తానని, అందరి సహాయ సహకారాలతో యూనివర్సిటీని ప్రగతి పథంలో ముందుకు తీసుకుని వెళ్తానని చెప్పారు. **శుభాకాంక్షలు వెల్లువ :** విసి ఆంజనేయ ప్రసాద్‌ను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఇసి సురేంద్రనాథ్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ హైదరాబాద్ ప్రొఫెసర్లు, కుటుంబ సభ్యులు, వైవీయూ రిజిస్టర్ వెంకటసుబ్బయ్య, ఎస్వీ యూని వర్సిటీ అధ్యాపకులు సత్కరించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లకు ప్రలోభాలు!

- ఓ ప్రయివేటు పాఠశాలలో లంచ్ బాక్సుల నిల్వ
- వరుసగా రెండో రోజూ పంపిణీకి యత్నం
- సిఎం జిల్లాలో నిబంధనలు బేఖాతర్


ఓ ప్రయివేటు పాఠశాలలో నిల్వ ఉంచిన లంచ్ బాక్సులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు తెరలేచింది. సాధారణంగా పోలింగ్‌కు రెండ్రోజుల ముందు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం చూశాం. కానీ ప్రస్తుతం ఎన్నికల ట్రెండ్ మారినట్లు కనిపిస్తోంది. పాత పద్ధతికి స్వస్తి చెప్పి కొత్త అంకానికి తెరలేపడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ముఖ్యమంత్రి జిల్లా కడపలో ఎన్నికల నిబంధనలను బేఖాతర్‌ను చేసి యథేచ్ఛగా ప్రలోభాలకు గురిచేయడం చర్చనీయాంశంగా మారింది. కడప-కర్నూలు-అనంతపురం ఉపాధ్యాయ ఎన్నికల్లో తాయిలాల పర్వం ఊపందుకుంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో అధికార వైసిపి, ఎటిపిఎఫ్, ఆపస్, పిడిఎఫ్ తరుపున అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారాలను సైతం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయకపోవడం, ఉపాధ్యాయులకు వేతనాలను సకాలంలో విడుదల చేయకపోవడం, యాప్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేయించడం, ఎన్నికల విధుల నుంచి ఉపాధ్యాయులను తప్పించడం, ఉపాధ్యాయ సంఘాల నేతలకు నోటీసులు ఇవ్వడం వంటి చర్యల కారణంగా ఉపాధ్యాయుల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది. ఇటువంటి పరిస్థితుల నేపత్యంలో అధికార పార్టీ తరుపున ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థి ఎలాగైనా గెలవాలనే ధ్యేయంతో పెద్దఎత్తున ప్రలోభాలకు తెరలేపినట్లు కనిపిస్తోంది. నిన్నటి రోజున జిల్లాలోని కడప, బద్వేల్, ప్రొద్దుటూరు, మైదుకూరు, వల్లూరు, కొండాపురం వంటి పలు ప్రాంతాల్లో తాయిళాల పంపిణీ వ్యవహారం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. 24 గంటలు గడవక మునుపే రెండవ సారి కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, ఎస్‌పి బంగళాకు కూతవేటు దూరంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో లంచ్ బాక్సుల పంపిణీ ప్రక్రియ సాగిపోతుండడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈనెల తొమ్మిదిన ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ నెల 16న నోటిఫికేషన్, మార్చి 13న పోలింగ్ 16న కౌంటింగ్ చేపట్టనున్నట్లు తెలిపింది. పోలింగ్‌నకు నెల రోజుల వ్యవధి నేపథ్యంలో అధికార పార్టీ తరుపున బరిలో నిలవనున్న అభ్యర్థి ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో అడ్డదారులను ఆశ్రయిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్ష టిడిపి తరుపున ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరూ పోటీ చేయని సంగతి తెలిసిందే. అధికార పార్టీ అండ ఉందనే తెంపరితనంతో ఎన్నికల నిబంధనలు నిలువునా ఉల్లంఘిం చడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డిని యామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేయడం దగ్గర నుంచి తాజాగా లంచ్ బాక్సుల పంపిణీ వ్యవహారాల్ని వరుసగా బట్టబయలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సిఐటియు కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి


సదస్సులో మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. శనివారం యుటిఎఫ్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై జిల్లా సదస్సు నిర్వహించారు. సదస్సుకు తిరూపాలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం జారీచేసిన 132, 680 జిఒలను వెంటనే అమలు చేయాలని కోరారు. జిఒఎంఎస్ నంబర్ 159 ప్రకారం ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చిందని పేర్కొన్నారు. ఈ కొత్త హాజరు విధానం ద్వారా ఎవరి సెల్‌ఫోన్‌లో వారే స్వయంగా ప్రభుత్వం నిర్ణయించిన ప్రదేశంలో నిలబడి ఫోటో తీసి ప్రభుత్వ యాప్‌లో హాజరు పంపించాలని తెలిపారు. మన గ్రామ పంచాయతీ కార్మికుల్లో అత్యధిక మంది చదువు రాని వారు ఉన్నారని చెప్పారు. అందులోనూ అత్యధిక మందికి సొంత స్మార్ట్ ఫోన్లు లేవని పేర్కొన్నారు. పైగా ప్రభుత్వం నిర్ణయించిన యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని పంపించగల అనుభవం అసలే లేనివారు ఉన్నారని తెలిపారు. అటువంటి వారితో తమ ఫొటోలు తామే తీసుకుని హాజరు పంపించాలని ప్రభుత్వం నిర్ణయించటం కార్మికుల జీతాలకు, ఉద్యోగాలకు ఎసరు పెట్టడమేనని చెప్పారు. ప్రభుత్వం చెప్పినట్లుగా తన ఫొటో తాను తీసుకుని పంపించకపోతే తాను రోజంతా పని చేసిన వృథా కిందే లెక్కన్నారు. ఎందుకంటే సక్రమంగా ఫొటో పంపకపోతే ఆ కార్మికుడికి హాజరు పడదు, హాజరు పడకపోతే జీతం కట్ అవుతుందని పేర్కొన్నారు. వరుసగా 4 లేక 5 రోజులు హాజరు పడకపోతే 'పని దొంగ' కింద లెక్క గట్టి ఉద్యోగం ఊడబెరికే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ కొత్త విధానం పూర్తిగా అమలయితే పండగలు, ఇతర సెలవులు కూడా అమలు కావని చెప్పారు. కార్మికులు బానిసల్లాగా పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇంతటి ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్న నూతన హాజరు విధానం కార్మికులకు ఉరితాడు లాంటిదేనన్నారు. ఈ విధానాన్ని తక్షణమే రద్దుచేసి కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాట ఫలితంగా నాటి ఉమ్మడి రాష్ట్రంలో 1999లో జిఒఎంఎస్ నంబరు 551ని నాటి ప్రభుత్వం జారీచేసిందని తెలిపారు. ఈ జిఒలో పేర్కొన్న గుర్తింపు కార్డులు, కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ పథకాలను పాలకులెందరు మారినా నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. కాని కార్మికులను వేదింపులకు గురిచేసే 'టెండర్ విధానం' మాత్రం పక్కాగా అమలు చెయ్యబడుతోందని తెలిపారు. అంటే కేవలం కార్మికులు, దళితులు, గిరిజనులు, బిసిలు, ఇతర పెత్తందార్లకు చెందిన పేదలు కావడం వల్లనే వివక్షకు గురౌతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన అనంతరం కార్మికుల పోరాట ఫలితంగా 2019లో కార్మికులకు గుర్తింపు కార్డులు, కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలను అమలు చేయాలని చెప్పారు. గతం నుంచి పనిచేస్తున్న కార్మికులను టెండర్లతో సంబందం లేకుండా విధుల్లో కొనసాగించాలని, 2015లో హైకోర్టు ఇచ్చిన తీర్పు బుట్టదాకలు చేయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేయటంతోపాటు చలో అసెంబ్లీ కార్యక్రమానికి కార్మి కులు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కిరణ్, శివ, వెంకటేష్, బాలయ్య, కొండయ్య, శారదమ్మ, అశ్వత, మేరీ, చంద్రమోహన్ పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిలో సిఎం జగన్ సరికొత్త అడుగులు : 'గడికోట'


గజమాలతో శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రాయచోటి

సంక్షేమాభివ ృద్ధిలో సీఎం జగన్ సరికొత్త ఆడుగులు వేస్తున్నారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సంబేపల్లె మండలం గుణ్ణికుంట్ల గ్రామంలోని దిగువ రాచపల్లె, గుణ్ణికుంట్ల కస్పా, శ్రీరామ్ నగర్ కాలనీ, ఆవులవాండ్లపల్లె, చెరువుముందరపల్లె, కత్తివాండ్లపల్లెలలో శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలును వివరిస్తూ, సమస్యలపై ఆరా తీస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లా డుతూ ఎన్నికల మేనిఫెస్టోలో జగన్ ఇచ్చిన హామీలను తొంభై ఎనిమిది శాతానికి పైగా అమలు చేయడంతో ప్రతి ఇంటా సంక్షేమ బావుటా ఎగురుతోందన్నారు. సంక్షేమాభివృద్ధిలో సిఎం జగన్ సరికొత్త అడుగులు వేస్తున్నారన్నారు. గుణ్ణికుంట్ల గ్రామంలోని ప్రతి పల్లెలో ఇంటింటికీ రెండూ లేక మూడు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ఇన్ని సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వం జగన్ ప్రభుత్వమేనని, ఏ ప్రభుత్వంలోనూ ఇన్ని సంక్షేమ పథకాలును చూడలేదంటూ ఇంటింటా శ్రీకాంత్ రెడ్డికి ప్రజలు తెలుపుతున్నారు. ఏనోట విన్నా సిఎం జగనన్న మేలు మరువలేమంటూ మహిళలు, ప్రజలు పేర్కొం టుండడం విశేషం. పండుగ వాతావరణంలో గుణ్ణికుంట్లలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. జిల్లా సాధకుడు, అభిమాన నేత శ్రీకాంత్‌రెడ్డికి గడప గడపనా ఆత్మీయ స్వాగతాలు, కర్పూర హారతులతో స్వాగతం పలికారు. క్రమశిక్షణ, పట్టుదలలతో చదివి ఉన్నత స్థానాలను సాధించాలని శ్రీకాంత్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపిపి ఆవుల నాగశ్రీలక్ష్మీ, జడ్‌పిటిసి గొర్ల కవిత, మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్ కుమార్‌రెడ్డి, మండల నాయకులు గొర్ల రమేష్‌రెడ్డి, సర్పంచ్ దండు నాగభూషన్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీధర్ రెడ్డి,మాజీ సర్పంచ్ సిద్దారెడ్డి, అన్నారెడ్డి, శివారెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శేఖర్, అశోక్‌రాజు, సర్పంచ్‌లు రఘునాథరెడ్డి, అమరనాథరెడ్డి, వెంకటరమణ నాయక్, నాయకులు రెడ్డిశేఖర్ రెడ్డి, కొండారెడ్డి,భూషణ, అమరనాథరెడ్డి, అనీల్‌రెడ్డి, శెట్టిపల్లె ఆనంద కుమార్‌రెడ్డి, లక్ష్మీజర్‌రెడ్డి, అశోక్ రెడ్డి, మోటకట్ల ప్రతాప్ రెడ్డి, భానుమూర్తి, శంకరయ్య నాయుడు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ విద్య : 'చింతల'


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని, పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో అందించడం కోసం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విశేష కృషి చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చదువుల విప్లవానికి నాడు నేడు పథకంతో సిఎం జగన్ నాంది పలికి విజయం సాధించారన్నారు. ప్రస్తుతం ఈ పథకం కేంద్రంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారిందన్నారు. విద్యార్థుల కోసం చేస్తున్న ఖర్చును ఏనాడు ఖర్చుగా భావించలేదని, భావితరాల భవిత కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం మానవ వనరులపై పెడుతున్న పెట్టుబడిగా భావిస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసిపి ప్రభుత్వం కేవలం విద్య కోసమే ప్రతి ఏటా రూ.30వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఈ కారణంగానే నేడు రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయి కార్పొరేట్ విద్యా సంస్థలతో పోటీ పడుతున్నాయని వెల్లడించారు. విద్యాశాఖపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న ప్రత్యేక చొరవ, పేద విద్యార్థులకు నాణ్యమైన చదువులు భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుపుతాయని ఎమ్మెల్యే విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నాడు-నేడు కింద మొదటి దశలో రూ.3,700 కోట్లతో 15,715 పాఠశాలలను పునరుద్ధరించి, రెండవ దశ కింద 16,911 ప్రత్యేక పాఠశాలలతో సహా 22,344 పాఠశాలలను పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. విద్యా పథకాలపై, అమ్మ ఒడి ఒక ప్రత్యేకమైనదని, దీని కింద 75శాతం హాజరు ఉన్న ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.15 వేలు సహాయం అందించడంతో పాటు తల్లి తన పిల్లలను పాఠశాలకు పంపేలా ప్రోత్సహిస్తోందన్నారు. గత మూడేళ్లలో ఈ పథకం కింద మొత్తం రూ.19,617 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. గోరు ముద్ద కింద రాష్ట్రం రూ.1800 కోట్లు ఖర్చు చేస్తోందని, పాఠశాల పునఃప్రారంభం రోజునే విద్యార్థులకు విద్యా కానుక కిట్లను ప్రభుత్వం అందిస్తుందని, రానున్న ఏడాదికి ప్రభుత్వం రూ.930 కోట్లు ఖర్చు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 8 నుండి 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు 5.18 లక్షల ట్యాబ్స్‌ను ప్రభుత్వం ఉచితంగా అందించిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతి గదుల డిజిటలైజేషన్ అమలులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లిస్తుందన్నారు. ఏపీ వ్యాప్తంగా అమలు చేస్తున్న విద్యా సంస్కరణలను దేశవ్యాప్తంగా 14,500 పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వమే నిర్ణయించిందన్నారు. వైసీపీ ప్రభుత్వం 'విదేశీ విద్యా దీవెన' ద్వారా 213 మంది విద్యార్థులకు రూ.19.95 కోట్లు ఆర్థిక సహాయాన్ని అందజేసిందన్నారు. పీలేరు నియోజకవర్గంలో ప్రస్తుతం ఫేజ్ 2 కింద 176 పాఠశాలలను అత్యాధునిక మౌలిక సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో రూ.960.98 కోట్లు ఖర్చు చేస్తూ.. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. ఈ ఖర్చు నాడు నేడు ఫేజ్ 2 కింద చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో పాటు అమ్మఒడి, జగనన్న గోరు ముద్ద, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల కింద కోట్ల రూపాయల మొత్తాన్ని భావి తరాల భవిత కోసం సీఎం జగన్ వెచ్చిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నీళ్లభాస్కర్, రాయుడు, రమేష్ రెడ్డి, కేశవ రెడ్డి, ఆనంద్, షావత్ అలి, సద్దాం హుస్సేన్, మహేంద్ర రెడ్డి, వెంకట్రమణ, మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిసి వెంకటయ్య

హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పైన అనుచితంగా, అవమానకరంగా మాట్లాడిన హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ అన్నమయ్య జిల్లా కో-కన్వీనర్ డిసి వెంకటయ్య డిమాండ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను చంపుతానంటూ అవమానకరంగా మాట్లాడిన హమారా ప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ, హత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయడమే కాకుండా అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు. ఇలాంటి వారిని శిక్షిస్తే తప్ప మరొకరు ఇలా మాట్లాడకుండా ఉంటారని తెలంగాణ రాష్ట్రం బిజెపి పార్టీకు చెందిన మతోన్మాద హమారా ప్రసాద్ నిరంతరం చేస్తున్న చిల్లర పనులకు తోడుగా వ్యక్తిగత ఇమేజ్ పెంచుకోవడానికి రాజ్యాంగా నిర్మాత పైన అనుచిత వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయని తెలిపారు. ప్రజల మధ్య కుల మతాల విద్వేషాలను రెచ్చగొడుతూ ఉన్నాడని అంబేద్కర్‌ను చంపుతానని అనడమే కాకుండా ఆయన బతికి ఉంటే గాంధీని గాడ్సే కాల్చినట్లు నేను కూడా అంబేద్కర్‌ని కాల్చి చంపేవాడిని అనడం సరికాదన్నారు. గాంధీని చంపిన గాడ్సే వారి వారసుడిగా ప్రకటించుకోవడం మత ఉన్మాదానికి నిదర్శనమన్నారు. ఇది జాతికి జరిగిన అవమానంగా పరిగణించి ప్రభుత్వాలు జోక్యం చేసుకొని జాతి నాయకులను కించపరిచే వారిపట్ల కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అనంతపురం గంగమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఈ నెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్న శ్రీఅనంతపురం గంగమ్మ జాతరను సమిష్టి కృషితో జయప్రదం చేద్దామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం జాతర మహోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందఠరేగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆయన ఆలయ కమిటీకి, అధికారులుకు సూచించారు. దాతలు, అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సేవా సంఘాలు సహకారం, సమన్వయంతో జాతరను విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్ర రాజు, మాజీ చైర్మన్ ఆనంద్ విజయ్ కుమార్, నాని బార్ సిద్దారెడ్డి, మానవతా చైర్మన్ బాల సుబ్రమణ్యం, కో-చైర్మన్ శివశంకర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రాచరాయుడు, సుబ్బ య్య, పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రతిభను వెలికి తీసేందుకే లీగ్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి-కడప


క్రికెట్ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని ఉన్నత క్రికెట్‌కు ఆడించాలన్న ఉద్దేశంతోనే ప్రతి శని, ఆదివారాలలో అండర్-12, 14, 16, 19, సీనియర్ ఏజ్ గ్రూపులలో లీగ్ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.భరత్‌రెడ్డి, కార్యదర్శి రెడ్డిప్రసాద్, డిసిఒ కాజా మైనుద్దీన్ తెలిపారు. లీగ్ మ్యాచ్లలో భాగంగా శనివారం స్థానిక కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో అండర్-12, 14 ఏళ్ల విభాగాల క్రీడాకారులకు మ్యాచ్ నిర్వహించారు. కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో అండర్-16, 19 ఏళ్ల విభాగాల క్రీడాకారులకు లీగ్ మ్యాచ్ నిర్వహించారు. కార్యక్ర మంలో జాయింట్ సెక్రటరీ ఎం.సాయి పృథ్వితేజ, పురుషుల ప్రతినిధి సిరాజుద్దీన్ దౌలా, సభ్యులు ముని కుమార్‌రెడ్డి, పైడికాల్వ విజయ్ కుమార్, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు. **165 పరుగులు చేసిన టీం-ఎ జట్టు :** కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో అండర్ -16, 19 ఏసు గ్రూపుల విభాగంలో నిర్వహించిన రెండు రోజుల మల్టీ డే లీక్ మ్యాచ్లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీం-ఎ జట్టు 49.1 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన టీం - బి జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 178 పరుగులు చేసింది.


టాస్ వేస్తున్న రెడ్డిప్రసాద్

ఘనంగా థామస్ అల్వా ఎడిసన్ జయంతి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

మానవ జాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బును రూపొందించిన శాస్త్రవేత్త థామస్ అల్వా ఎడిసన్ అని స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్ఎం శంకర అన్నారు. శనివారం థామస్ అల్వా ఎడిసన్ జయంతిని పురస్కరించుకొని, స్థానిక పాఠశాలలో ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడిసన్ 1847 ఫిబ్రవరి 11న జన్మించారని, 1878లో ఎలక్ట్రిక్ బల్బ్‌ను రూపొందించారన్నారు. థర్మో అయానిక్ ఎమిషన్ గురించి వెల్లడించారని తెలిపారు. 1887-1889 మధ్య కాలంలో టైప్ రైటర్, ఎలక్ట్రిక్ పెన్, గ్రామ్ ఫోన్, మోషన్, పిక్చర్ కెమెరా తదితర వాటిని రూపొందించారన్నారు. 1877లో కనిపెట్టన ఫోనోగ్రాఫ్ పరికరాన్ని చూసి ప్రజలు సంభ్రమాశ్చర్యాలకు గురయారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు వసుమతి, వెంకటేశ్వర రెడ్డి, రసూల్ బావాజీ, భాస్కర్ నాయక్, పురుషోత్తం, నాగేశ్వర, దుర్వాసులు నాయుడు, నాగరాజ, శంకర, చంగయ్య, శేఖర్ రెడ్డి, తారాదేవి, మధు బాబు రెడ్డి, ఖదీర్ బాషా, హైమావతి దేవి, ఉషాకుమారి, రెడ్డెమ్మ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.


అల్వా ఎడిసన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జాతీయ లోక్ అదాలత్‌లో 12,438 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-కడప

జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 12,438 కేసులు పరిష్కారం చేసి రూ.7.79 కోట్లు కక్షిదారులకు నష్టపరిహారం చెల్లించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి ప్రధాన న్యాయమూర్తి మూర్తి, సీనియర్ సివిల్ జడ్జి కవిత తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 25 బెంచీలు ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్ నిర్వహించినట్లు తెలిపారు. ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా కృషి చేసిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు, వైద్య, రవాణా, ఇన్సూరెన్స్, బ్యాంకు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాలుగవ అదనపు జిల్లా న్యాయమూర్తి గీత, సీనియర్ సివిల్ జడ్జి హేమలత, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ కుమార్, సెకండ్ ఏడియం షేక్ రియాజ్, ఎక్సైజ్ మెజిస్ట్రేట్ హేమ స్రవంతి, ప్రిన్సి పల్ జూనియర్ సివిల్ జడ్జి మోతిలాల్, న్యాయవాదులు, కచ్చిదారులు పాల్గొన్నారు.


కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి మూర్తి

'ఖాతాదారులకు మెరుగైన సేవలందించండి'

రాయచోటి టౌన్ : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులును ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కోరారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఎంఎల్‌ఏ కార్యాలయంలో శ్రీకాంత్ రెడ్డిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజంపేట రీజనల్ మేనేజర్ ఆర్.రామకృష్ణ, సేల్స్ చీఫ్ మేనేజర్ సురేష్ బాబు, రాయచోటి శాఖ చీఫ్ మేనేజర్ జగదీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి బ్యాక్ అధికారులుతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన రైతులకు, నిరుద్యోగ యువతకు రుణాలు ఇవ్వాలని కోరారు.గాలివీడు మండలంలోని నూలివీడు, సంబేపల్లె మండలంలోని శెట్టిపల్లె, రాయచోటి రూరల్ మండలంలోని మాధవరం, రామాపురం మండలంలో గువ్వలచెరువు, నీలకం ఠరావుపేట, లక్కిరెడ్డిపల్లె మండలంలో ఎటిఎం కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఖాతాదారులకు మరింత సౌలభ్యంగా ఉంటుందని సూచించారు.


శ్రీకాంత్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి

రాయచోటి : ఈ నెల 15 నుంచి 25వ తేదీ వరకు జరిగేశ్రీభద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ చైర్మన్ విజయ, ఇఒ రమణారెడ్డి పేర్కొన్నారు. శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు జిల్లా కేంద్రం రాయచోటిలో ఈసారి తొలిసారిగా నిర్వహిస్తున్నామన్నారు. బ్రహ్మోత్సవాలకు కర్ణాటక భక్తులు అధికంగా వస్తారని తెలిపారు. అన్నదాన కార్యక్రమం, సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు పార్కింగ్ స్థలం కూడా ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాత రాయచోటిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు

సమరభేరి!

ప్రజాదృష్టి

ఇటీవలి వారంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు సమరశంఖం పూరించారు. 2019 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే డిమాండ్‌తో కోరుతూ కడప, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ల ఎదట నిరసన ప్రదర్శనలకు దిగడం తెలిసిందే. తమకు 2017 నవంబర్‌లో చేపట్టిన పాదయాత్ర సందర్భంగా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిపక్ష హోదాలో అంగన్వాడీలకు మెరుగైన వేతనాలు, ఇతర సదుపాయాలను కల్పిస్తామని హామీలిచ్చి, సెల్ఫీలు తీయించుకున్న ఘటనను గుర్తు చేయడం ప్రభుత్వ విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేసింది. తాము అధికారంలోకి వస్తే తెలంగాణాలోని అంగన్వాడీల కంటే మెరుగైన వేతనాలు, ఇతర సదుపాయాలను కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలదీయడం గమనార్హం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం సవాల్‌గా మారిందని చెప్పవచ్చు. ఇప్పటికే రాష్ట్రంలో ఒకవైపు ఉపాధ్యాయుల రుసరుసలు మరోవైపు అంగన్వాడీల నిరసన ప్రదర్శనలతో ప్రభుత్వానికి ఊపిరి ఆడని పరిస్థితి ఏర్ప డింది. ఇదేపట్టుదలతో అంగన్వాడీలు ఉద్యమాన్ని కొనసాగిస్తే ఇచ్చిన హామీలను నెరవేర్చుకునే అవకాశం ఉందని చెప్పవచ్చు. ఉమ్మడి కడప జిల్లాలో సుమారు ఏడు వేల మంది వరకు అంగన్వాడీలు ఉన్నట్లు అంచనా.ఇదేతరహాలో అన్న మయ్య జిల్లాలోనూ ఉన్నారు. దేశంలో పిల్లలు, మహిళల్లో రక్తహీనత, గ్లుకోమా వంటి వ్యాధులకు అంగన్వాడీ వర్కర్లు పౌష్టికాహారాన్ని అందిస్తూ సమాధానంగా నిలిచిన సంగతి తెలిసిందే. దేశంలోనే గుజరాత్ తదితర రాష్ట్రాలు అధ్వాన్న రేటులో కునారిల్లుతున్న దశలో రాష్ట్రంలో కొనుగోలు శక్తి ఆధారంగా జిఎస్‌డిపి రేటు మెరుగైన స్థితిలో నిలవడానికి గల కారకుల సేవలను గుర్తించాల్సిన అవసరం ఉంది. అంగన్వాడీలతో ప్రభుత్వం తమ సంక్షేమ పథకాల ప్రచారం మొదలుకుని సర్వేలు, సాధికారితా గుర్తింపు వరకు ఉపయోగించుకుంటున్న సంగతి తెలిసిందే. కరోనా సమయంలోనూ రోగులకు మందులు సరఫరా చేయడంలో విశేష కృషి చేశారు.ఇటువంటి క్షేత్రస్థాయి సిబ్బంది న్యాయమైన సమ స్యలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 2024 సార్వత్రిక ఎన్నికల సీజన్ మొదలైన నేపథ్యంలో ఉద్యమకారులు శక్తివంచన లేకుండా సమరశంఖం పూరిస్తేనే సత్ఫలితాలు సాధించే అవకాశాలు ఉన్నాయని చెప్పుకోవచ్చు. లేనిపక్షంలో మరో సార్వత్రిక ఎన్నికల వరకు నిరీక్షించాల్సి వస్తుందనడంలో సందేహం లేదు. తస్మాత్ జాగ్రత్త అని గుర్తుంచుకోవాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఇఒ, ప్రిన్సిపల్

వంట ఏజెన్సీలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని స్థానిక ఎస్‌బివిఎన్ సభ హై స్కూల్లో అన్ని పాఠశాలల వంట ఏజెన్సీలకు ఎంఇఒ రంగనాథయ్య ఆధ్వర్యంలో వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో అన్ని పాఠశాలల వంట మనుషులు పాల్గొన్నారు. వారు వండిన వంటలను ముగ్గురు జడ్జిల ఆధ్వర్యంలో పరిశీలించి మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి విజేతగా జి.రాజేశ్వరి, రెండవ బహుమతిగా ఎస్ భాగ్యమ్మ, మూడవ బహుమతిగా పి.కృష్ణమ్మలకు ఎంఇఒ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి పాఠశాలల్లో ప్రభుత్వం అందించే మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వండాలని, రుచికరంగా ప్రతి విద్యార్థి తినే విధంగా వండి పెట్టాలని చెప్పారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థి స్కూల్లోనే వంట ఏజెన్సీ ద్వారా వండిన వంటనే తినాలని తెలిపారు. వంట ఏజెన్సీలకు కూరల్లో నాణ్యత ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల వంట ఏజెన్సీలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి ప్రణాళికలు

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయం వద్ద ఉన్న శ్రీ సౌమ్యనాథ సేవ ట్రస్ట్ నిత్య అన్నదానానికి ప్రముఖ పారిశ్రామికవేత్త పివిఎస్ మూర్తి ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన డాక్టర్ మంగర దిలీప్, డాక్టర్ సంహిత దంపతులు రూ.1.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి శుక్ర, శని, ఆది వారాలలో అన్నదానం చేస్తున్నామని తెలిపారు. త్వరలో నిత్యాన్నదానం చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని పేర్కొన్నారు. అన్న దానానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో కోశాధికారి చక్రాల రామసుబ్బన్న, ట్రస్ట్ సభ్యులు జంగం శెట్టి వెంకటసుబ్బయ్య, లంకయ్య గారి సుబ్బరామయ్య పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి వాసికి డాక్టరేట్

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

చెన్నైలోని ప్రసిద్ధ సత్యభామ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్గా పనిచేస్తున్న పి.హమీమ్ ఖాన్‌కు అనంతపురంలోని జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయం నుండి పిహెచ్‌డి పట్టా మంజూరు చేశారని హమీం ఖాన్ పేర్కొన్నారు. డాక్టర్ టి.నారాయణరెడ్డి, డాక్టర్ ఆలియా సుల్తానా మార్గ దర్శకత్వంలో హైదరాబాద్ నగరంలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంపెనీలలో సామర్థ్య ఆధారిత మానవ వనరుల అభ్యాసం. ఉద్యోగుల నిలుపుదలపై దాని ప్రభావంపై అధ్యయనం అనే పేరుతో చేసిన థీసిస్ పరిశీలించి ఈ అవార్డు మంజూరు చేశారన్నారు. ఈ మేరకు జెఎన్‌టియు అనంతపురం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ నుంచి ఉత్తర్వులు అందుకున్నట్లు చెప్పారు. డాక్టరేట్ రావడం పట్ల కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులు సురేష్, భాను ప్రకాష్, ఓబులరెడ్డిలు అభినందించారు.

14న మహాశివరాత్రి ఏర్పాట్లపై సమావేశం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహాశివరాత్రి పండుగ సందర్భంగా అత్తిరాల క్షేత్రానికి వచ్చే భక్తులకు ఏర్పాటు కార్యక్రమాలపై ఈనెల 14న సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. సందర్శకులకు ఏర్పాటు చేయనున్న సహాయక చర్యలు, సౌకర్యాలు, పారిశుధ్య పనులు, వైద్య సహాయక చర్యలు, భక్తులకు దేవస్థానము లోపల, వెలుపల క్యూ లైన్ల సందర్శన ఏర్పాట్లు తదితర అంశాలపై అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పోలీస్, మున్సిపల్, వైద్య, ఎన్‌సిసి వాలంటీర్లు, కళాశాల విద్యార్థులు, ఆర్‌టిసి, అగ్ని మాపక, అటవీశాఖ, ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొనాలని కోరారు.

ఆర్‌బికె చైర్మన్‌ను పరామర్శించిన ఎపిఎండిసి డైరెక్టర్

ప్రజాశక్తి-పీలేరు

మండల ఆర్‌బికె చైర్మన్ చింతల మల్లికార్జునను శనివారం ఎపిఎండిసి డైరెక్టర్ సి.హరీష్ రెడ్డి పరామర్శించారు. మండలంలోని మలుగూరు వాండ్లపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఒంటిల్లులోని చింతల పురమ్మ దేవస్థానంలో జరిగిన ప్రత్యేక పూజలలోనూ పాల్గొన్నారు. పీలేరు సర్పంచ్ షేక్ హబీబ్ బాష, కెవి పల్లి మండల యూత్ కన్వీనర్ గజ్జల శీను రెడ్డి, కావలిపల్లి సర్పంచ్ లోకనాథ్ రెడ్డి, నాయకులు చక్రధర్, చైతన్య, ప్రేమానంద రెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండ అడవికి నిప్పు

ప్రజాశక్తి-ములకలచెరువు

మండలంలోని నల్లగొండకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఈ కొండ ప్రాంతంలో ఏటా శీతాకాలంలో ఆగంతకులు నిప్పంటించి దగ్ధం చేస్తుంటారు. కొండపై చెట్లు, ఎండిన గడ్డి, చీపురు మొక్కలు బాగా పెరిగి పోవడంతో మంటలు పెద్దఎత్తున వ్యాపించాయి. స్థానిక గొర్రెలు కాపరులు, పశువుల కాపరులు,ప్రజలు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా వీలు కుదరలేదు. ఇదంతా ఆకతాయిల పనేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రి వరకు మంటలు పెద్ద ఎత్తున వాపిస్తూనే ఉన్నాయి. ఇటువంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి-కలకడ

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ రాధ పేర్కొన్నారు. శనివారం మండలంలోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేందుకు సిబ్బంది కృషి చేయాలన్నారు. పాఠశాలలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ వెనుకబడిన విద్యార్థులకు పాఠ్యాంశాల వారిగా ప్రత్యేక తరగతులు నిర్వహించి, ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు శ్రమించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ అనిత ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతంపల్లి గ్రామంలో మేడాలమ్మ విగ్రహ ప్రతిష్ట శనివారం గ్రామస్తుల మధ్య అంగరంగ వైభవంగా వేద పండితులు చేత నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ పాల్గొని, మేడాలమ్మ తల్లి దేవాలయం నిర్మించడం సంతోషదాయకమని తెలిపారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని దాత గుడ్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రోడ్డు ప్రమాద ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు. ఈనెల 2న వెంగంవారిపల్లె పంచాయతీ గొల్లపల్లికు చెందిన గుర్రప్ప (30), కత్తిరివారిపల్లెకు చెందిన సురేంద్ర ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళుతుండగా వాల్మీకిపురంకు చెందిన వంశీకృష్ణ తన కారు నంబర్ ఏపీ 03 బిడబ్ల్యు5229తో ద్విచక్రవాహనాన్ని నిమ్మనపల్లె సమీపంలో ఢీ కొన్నాడు. ప్రమాదంలో ద్విచక్రవాహనంలో ఉన్న ఇద్దరు గాయపడ్డారు. బాధితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్సలు అనంతరం గుర్రప్ప పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రూయాకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ఘటనపై గుర్రప్ప తండ్రి సీతారామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులకు న్యాయం చేయడమే లోక్ అదాలత్ లక్ష్యం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అర్హులందరికి న్యాయం చేయడమే లోక్ అదాలత్ ముఖ్య లక్ష్యమని మూడవ అదనపు జిల్లా జడ్జి మురళి కృష్ణ పేర్కొన్నారు. కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన మెగా లోక్ అదాలత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెగా లోక్ అదాలత్ ద్వారా అనేక కేసులను పరిష్కరించడం జరిగినదని తెలిపారు. సివిల్ కు సంబంధించి సుమారు రూ.1.24 కోట్లు రికవరీ కూడా జరిగినట్లు ఆయన తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పడిన ప్రజా న్యాయస్థానం కుల, మత, వర్గ, పేద, ధనిక వర్గాల తారతమ్యం లేకుండా అర్హులైన ప్రజలందరికీ న్యాయం చేస్తుందని తెలియజేశారు. జూనియర్ సివిల్‌జడ్జి సంధ్యారాణి మాట్లాడుతూ న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేని పేదవారికి కోర్టు తరపున న్యాయమూర్తిని నియమిస్తుందని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాజీమార్గమే రాచ మార్గమని అన్నారు. రాజీమార్గాన కేసులు పరిష్కరించుకున్న వారందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిఎస్‌పి జి.శివ భాస్కర్ రెడ్డి, ఎజిపి గురు ప్రతాప్, ఎడిడిఎల్‌పిపి జానీ, ఎపిపి రెహానా, సీనియర్ న్యాయవాదులు కృష్ణకుమార్, శోభారాణి, మోహన్ బాబు, రమణ, రమేష్, సుదర్శన్, శ్రీను, శేఖర్, సురేంద్ర, జాబిన్, తాజ్, కోర్టు సిబ్బంది మధు, చెండరాయుడు, సాల్మన్, సాంబశివారెడ్డి పాల్గొన్నారు. **నందలూరు :** మైనర్ పిల్లలు వాహనం నడపడం నేరమని వారికి వాహనాలు అప్పగించిన వ్యక్తులు సైతం శిక్షకు గురి కావాల్సి వస్తుందని చైర్మన్ మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ నందులూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత అన్నారు. శనివారం కోర్టు ఆవరణంలో లోక్‌అదాలత్ లో భాగంగా జరిగిన న్యాయవిజ్ఞాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోటార్ వాహన చట్టంలో సెక్షన్ 180, 181 కింద 18 సంవత్సరాలలోపు వారు వాహనం నడపరాదన్నారు. తల్లిదండ్రులు సైతం సరదా కోసం పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించరాదని హెచ్చరించారు. పిల్లలు వాహనాలు ఎక్కితే వారికి మాత్రమే కాకుండా ఇతరులకు సైతం ప్రాణాపాయం ఎదురవుతుందని గుర్తు చేశారు. మైనర్లు వాహనాలు నడిపి ప్రమాదాలు చేస్తే వారికి భవిష్యత్తు అంధకారం అవుతుందని అన్నారు. పిల్లలు ఎక్కువగా సెల్ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ డ్రైవింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేసి నేరాలు ఆహ్వానిస్తున్నారని తెలియజేశారు. ఈ తరహా ఘటనలో గతంలో



లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న మూడవ అదనపు జిల్లా జడ్జి మురళీకృష్ణ

పలువురు ప్రాణాలు కోల్పోయారని ఆమె తెలిపారు. ఈ చట్టం కింద కఠినమైన శిక్షలు ఉంటాయని పిల్లలు భవిష్యత్తు ఆందోళనకరంగా మారుతుందని వెళ్ళడించారు. తల్లిదండ్రులు ఈ విషయంలో పూర్తిస్థాయిలో గుర్తు తెరిగి ప్రవర్తించాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు దాసరి నరసింహులు, హెచ్. ఆనంద్ కుమార్, జి.సుబ్బరామయ్య, ఎస్ మహమ్మద్ అలీ, ఎవి.సుబ్రహ్మణ్యం,తహశీల్దార్, ఎంఇఒలు, ఎంపిడిఒలు, పోలీసులు, కక్షిదారులు, కోర్టు సిబ్బంది, పిఎల్‌వి, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. **వాల్మీకిపురం :** రాజీయే రాజమార్గమని వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సిహెచ్‌వి.రామక్రిష్ణ అన్నారు. శనివారం స్థానిక కోర్టులో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కేసులతో సతమత మవుతున్న కక్షిదారులు రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేందుకు జాతీయ లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు, తదితర మొత్తం 282 కేసులను పరిష్కరించారు. పలు కేసులకు సంబంధించి రూ.76.19 లక్షలు నగదు రికవరీ అయ్యిందన్నారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసులు, కరీముల్లా బేగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రెడ్డెప్ప, ఎజిపి అశోక్‌కుమార్‌రెడ్డి, న్యాయవాదులు, పోలీసులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఆగ్రహారం ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిచండి : సిఐటియు



ప్రాథమిక పాఠశాలలో పగుళ్లను చూపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి మైనింగ్ తవ్వకాల వల్ల అగ్రహారంలో ఇల్లు నెర్రెలు చీలడం, హెవీ బ్లాస్టింగ్ వల్ల రాళ్లు పడడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, వారికి నష్టపరిహారం చెల్లించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు దాసరి జయచంద్ర, మండల కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యక్షులు పులగంటి శ్రీనివాసులు, సంఘటన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ అగ్రహారానికి అడుగడగనా అన్యాయానికి గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎపిఎండిసి యాజమాన్యం రెవెన్యూ అధికారులు, రెండు నెలల్లో గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలిస్తామని గ్రామ పెద్దల సమక్షంలో హామీ ఇచ్చారని తెలిపారు. మూడు నెలలు గడుస్తున్నా దాని ప్రస్తావనే లేదన్నారు. 2013 పునరావాస ఆక్ట్ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని అన్నారు. ఉద్యోగం, ఉపాధి అయినా కల్పించాలని, లేకుంటే వన్ టైం సెటిల్మెంట్ కింద రూ.20 లక్షల పరిహారం చెల్లించాలన్నారు. స్థలం ఇచ్చి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులకు న్యాయం జరగకపోతే సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పులగంటి చలపతి, పులగంటి జయకృష్ణ, దేరంగుల సుబ్బయ్య పాల్గొన్నారు.



అన్నదానం ట్రస్టుకు విరాళం అందజేస్తున్న జయరామనాయుడు

అన్నదాన ట్రస్ట్‌కు రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నియోజకవర్గంలోని తవళం పంచాయతీ శ్రీయోగనేల మల్లేశ్వరస్వామి ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నదానం ట్రస్టుకు నియోజక వర్గ టిడిపి నాయకులు జయరామ నాయుడు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మాజీ మండల అధ్యక్షుడు రామకృష్ణకి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా జయరామ నాయుడు మాట్లాడుతూ నేలమల్లేశ్వరస్వామి ఆలయం ఇటీవల కాలంలో ఎంతో అభివృద్ధి సాధించిందని కితాబునిచ్చారు. కార్యక్రమంలో పెంచుపాడు స్వామి, జేవిరమణ, మేస్త్రి రమణ, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.



పిల్లలతో ర్యాలీ నిర్వహిస్తున్న పోర్డ్ సంస్థ సభ్యులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బడిఈడు పిల్లలందరిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి చదువును కొనసాగించేటట్లు స్థానిక పోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం పెద్దమండ్యం మండలంలోని 15 గ్రామాలలో, మదనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12 కాలనీలలో, ఈనెల 11నుంచి 15వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు స్థానికపెద్దలు, సచివాలయ సిబ్బంది సహకారంతో నిర్వహించి తల్లి తండ్రులకు చదువు ప్రాముఖ్యత, బాలకార్మిక, బాల్య వివాహాల సమస్యలపై ఆవగాహన కల్పించారు. ప్రతి కుటుంబంలోని పిల్లలు అందరు వారి చదువు కొనసాగించేలా చూడాలని పోర్డ్ సంస్థ డైరెక్టర్ లలితమ్మ తెలిపారు. శనివారం గొల్లపల్లి నందు కమ్యూనిటీ సచివాలయ సిబ్బంది సమన్వయంతో తల్లితండ్రులతో సమావేశం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలను తప్పనిసరిగా చదివించి, బాల్య వివాహాలకు గురికాకుండా చూడాలన్నారు. బాలికల అభ్యున్నతికి తల్లిదండ్రుల కూడా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోర్డ్ సంస్థ సిబ్బంది సుభాషిణి, సంపూర్ణ, అల్తాఫ్ బాషా పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండల కేంద్రంలోని లక్కిరెడ్డిపలిలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు తాగునీరు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ప్రత్యేక అధికారి సాంబశియ్యా పేర్కొన్నారు. శనివారం అంబేద్కర్ బాలికల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, తరగతి గదులు పరిశీలించారు. మరుగుదొడ్లు, తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. గతంలో బోరు వేశారని ఈ బోరు నుంచి ఫ్లోరైడ్ నీరు వస్తుందని ఈ నీరు తాగడం వల్ల విద్యార్థులు చాలా అనారోగ్య పాలవుతున్నారని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తెచ్చారు. సమస్య సత్వర పరిష్కారానిక కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్వాంటా సేవలు అభినందనీయం

- ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి

ప్రజాశక్తి - కలసపాడు

పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల విద్యాభివృద్ధికి అడ్వాంటా సీడ్స్ కంపెనీ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి పేర్కొన్నారు. ఇ.రామాపురం ప్రాథమిక, ఉన్నత పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు అడ్వాంటా కంపెనీ ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి అడ్వాంటా వంటి కంపెనీలు కూడా సహకారం అందించడం హర్షణీయమన్నారు. పిల్లలు కూడా చదువుతో పాటు సంస్కారం, విలువలు, క్రమశిక్షణ, పట్టుదల, సహాయం చేయడం వంటి మంచి గుణాలను అలవర్చుకోవాలని ఆయన సూచించారు. అడ్వాంటా కంపెనీ రీజనల్ మేనేజర్ ప్రవీణ్ మాట్లాడుతూ పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేయడంలో తాము ముందుంటామని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు పవన్‌కుమార్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, నాగమణి, సురేష్, సునీల్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, రామకృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, రాఘవేంద్ర, రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : 'బత్యాల'

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి కృషి చేయాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బత్యాల చెంగల్ రాయుడు టిడిపి శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం మండల టిడిపి అధ్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఒంటమిట్టలోని షాదిఖానాలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బత్యాల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సిద్దవటం మండలంలో ఉన్న 32 బూత్‌లలో ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. 32 మంది బూత్ కన్వీనర్లు 2023 ఓటర్ లిస్టును పరిశీలించి పూర్తి అవగాహన కలిగి వుండాలని ఆదేశించారు. నాయకులు, కార్యకర్తలు విభేదాలను పక్కన పెట్టి పార్టీ అభివృద్ధి కోసం సమన్వయంతో పనిచేయాలని కోరారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చేసే బాధ్యతను ప్రతి కార్యకర్త తీసుకోవాలన్నారు. నారా లోకేష్ పాదయాత్ర విజయవంతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ ఇంచార్జి, గ్రామ కమిటీ అధ్యక్షులు, యూనిట్ ఇంచార్జీలు, బూత్ కన్వీనర్లు, పార్లమెంటు, అసెంబ్లీ పదాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమన్వయకర్తల నియామకం

ప్రజాశక్తి - కడప

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్దరాజు, రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం సూచనల మేరకు హాత్‌సేహాత్ జోడో అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో అమలుపరచుటకు నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు తెలిపారు. ప్రొద్దుటూరుకు మల్లెం విజయభాస్కర్, షేక్ ఆరిపుల్ల, పులివెందులకు జోడు నాగరాజు, జానకి రామకృష్ణ, కమలాపురంకు ధ్రువ కుమార్ రెడ్డి, బీగాల రామక్రిష్ణ, మైదుకూరుకు నాసిర్‌ఖాన్, గోర్ల శ్రీనివాసులు, జమ్మల మడుగుకు డాక్టర్ అన్వర్ భాష, అమర్నాథరెడ్డి, బద్వేల్ కు శ్యామలాదేవి, తిరుమలేష్, కడపకు షేక్ ఇమామ్ సాబ్, ఇల్లూరు కృష్ణారెడ్డిలను నియమించినట్లు తెలిపారు.

ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫమైందని టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మనోజీరావు వీధిలో శనివారం ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. వైసిపి పాలన అప్పులు తీసుకురావడంలో తప్ప, అభివృద్ధిలో వైఫల్యం చెందిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో జగన్ ఇచ్చిన హామీలేమైనాయని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో షబ్బీర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి తాటి శ్రీనివాసుల యాదవ్, మెరువా మూర్తి, లీగల్ సెల్ జిల్లా సెక్రెటరీ వినోద్‌కుమార్, నియోజకవర్గం బిసి సెల్ అధ్యక్షుడు తమ్మిశెట్టి సురేంద్ర, టిఎన్‌టియుసి పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పి



అరెస్టయిన నిందితుడు, పట్టుబడిన సామగ్రితో పోలీసులు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.14 లక్షల విలువైన సామగ్రి స్వాధీనం : ఎస్పి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

వివిధ జిల్లాలలో గత మూడు నెలలుగా వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను మొలకలచెరువు పోలీసులు పక్క ప్రణాలికతో అరెస్టు చేసినట్లు ఎస్పి హర్షవర్ధన్‌రాజు పేర్కొన్నారు. శనివారం ఎస్పి మీడియా సమావేశంలో నిందితుడి వివరాలు వెళ్లడించారు. కడప జిల్లా అంగడి వీధికి చెందిన పొలం ధనకుమార్, ఎల్లనూరు రోడ్డు బిందిలోల్ల కాలనీ తాడిపత్రిలో నివాసముంటూ అనంతపురం, సత్యసాయి, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాలలో చోరీలకు పాల్పడుతూ ఉండేవాడని తెలిపారు. ఇతనిపై ఆయా జిల్లాలలో కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. కదిరి, ప్రొద్దుటూరు పట్టణాలలో ఎంఆర్ఎఫ్ టైర్స్ షోరూమ్‌లో 20 టైర్లు, మదనపల్లి పట్టణంలో ఎలక్ట్రిక్,పెయింట్ షో రూమ్ లలో 142 కేజీల కాపర్ వైరు, రూ.2.25 లక్షల నగదు దొంగిలినట్లు తెలిపారు. పీలేరు, ఎలక్ట్రిక్ షోరూంలో 22 కాపర్ వైన్డింగ్ బాక్సులు, మొలకలచెరువు ఎలక్ట్రికల్ షోరూమ్‌లో 25 కాపర్ వైన్డింగ్ బాక్సులు చోరీ చేశాడని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు దొంగను పట్టుకోవడానికి ములకలచెరువు సిఐ సాధిక్ అలీ నేతృత్వంలో స్పెషల్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎలాగైనా కేసును చేదించాలని ఉద్దేశంతో సిబ్బంది గత మూడు నెలల్లో వివిధ జిల్లాలలో జరిగిన చోరీల ఆధారంగా ముద్దాయి ధనకుమార్ పై నిఘా ఉంచి నట్లు పేర్కొన్నారు. పక్కా సమాచారంతో మదనపల్లికి దొంగతనానికి పాల్పడానికి పరికరాలతో వెళ్తున్న సమయంలో అదుపులోకి తీసుకున్నామని అన్నారు. నిందితుడు ఎంతో జాగ్రత్తగా పోలీసులకు దొరకకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖానికి మంకీ క్యాప్ ధరించడం, చేతులకు గ్లౌజులు వాడడం, సిసి కెమెరాలు ధ్వంసం చేయడం, డివిఆర్ బాక్సులను వెంట తీసుకువెళ్లడం చేస్తుండేవాడని చెప్పారు. పోలీసు సిబ్బంది ఎంతో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు అతను నివాసమున్న తాడిపత్రిలో వేరే జిల్లాలలో దొంగలించిన 16 లారీ టైర్లు, 25 కాపర్ వైన్డింగ్ బాక్సులు, ఒక బొలెరో వాహనం, చోరీలకు ఉపయోగ పడే వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ సుమారు రూ.14 లక్షలు ఉంటుందని తెలిపారు. చాక చక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న పోలీస్ సిబ్బందిని నగదుతో అభినందించారు. కార్యక్రమంలో ములకలచెరువు ఎస్ఐ డివై.స్వామి, కానిస్టేబుళ్లు వెంకటేష్, సిరాజ్ బాషా, తాతయ్య, శివకుమార్ పాల్గొన్నారు.

నాటు సారా ఊట ధ్వంసం

కలకడ : నాటుసారా ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని దిగువ తండా పంచాయతీ దిగుతాండ సమీపంలో ఉన్న గుట్ట ప్రాంతంలో నాటు సారా తయారు చేయడానికి ఉంచిన 400 లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ నాటు సారా తయారుచేసినా, విక్రయించినా, తరలించినచో వారిపై కఠిన చర్యలు తీసుకొని, కేసుల నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రాజేంద్ర నాయక్, తాతయ్య, హోంగార్డ్ రమేష్ పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

ప్రజాశక్తి-కలికిరి

మండల పరిధిలోని మెడికుర్తి పంచాయతీ బహుదానది సమీపంలో పేకాట శిబిరంపై దాడులు చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో నలుగురు పట్టుపడగా, మిగిలిన నలుగురు పారిపోయి నట్లు తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.30,700 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని 8 మంది పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మనోహర్, పిసిలు జిలానీ బాషాలు పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని కదిరాయ చెరువు సమీపంలో ఉన్న వడ్డిపల్లి వద్ద గల హంద్రీ-నీవా కాలువ ప్రక్కన పేకాట ఆడుతున్నట్టు సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న ఆరుగురుని పట్టుకుని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.4,020 నగదును స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ దాడులలో పోలీస్ సిబ్బంది శ్రీనివాసులు, రాజేంద్ర నాయక్, కాంతారావు, హోంగార్డు రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

కలకడ : రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని బాటవారిపల్లి పంచాయతీ పోతువారిపల్లికు చెందిన కంబల్ల రెడ్డప్ప తన టివిఎస్ ఎక్స్ఎల్ స్కూటర్లో ఈనెల 4న సాయంత్రం కలకడ నుండి తన స్వగ్రామం పోతువారిపల్లికి చెందిన పూజారి రామయ్యను ఎక్కించుకొని వెళుతుండగా బాటవారిపల్లి హై స్కూల్ దగ్గర, కలకడకు చెందిన మల్లూరు మహమ్మద్ ఖాసిం తన ఫ్యాషన్ ప్రో మోటార్ సైకిల్ నడుపుతూ అతివేగంగా, నిర్లక్ష్యంగా వచ్చి రెడ్డప్ప వాహనాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రెడ్డప్పకు, అతని వెనకాల కూర్చున్న రామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరిని 108 అంబులెన్స్ లో పీలేరు ఆస్పత్రికి తరలించిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ప్రమాదంలో గాయపడిన రెడ్డప్ప వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుడి కుమారుడు బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మల్లూరు మహమ్మద్ ఖాసిం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు...

నందలూరు : మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లెలో శనివారం విషాదం చోటుచేసుకుంది. ఈ నెల 23న పెళ్లి చేసుకోనున్న రామిశెట్టి వెంకట సుబ్బయ్య (24) అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా, మృతుని రెండు చేతులు వీపు వైపుకు కట్టి ఉండడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనా స్థలానికి మన్నూరు సిఐ పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలంతో పాటు స్థానిక ఎఎస్ఐ సుబ్బరాయుడు,పోలీసులు చేరుకుని పరిసరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై అనుమానాస్పద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపడతామని సిఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

మదనపల్లిలో ఒకరు.. తంబళ్లపల్లిలో మరొకరు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన రూరల్ పరిధిలో చోటుచేసుకుంది. కలికిరి మండలం, గుట్టపాళ్యం పంచాయతీ, జి. బరినేపల్లికి చెందిన వి.సుబ్బయ్య కుమారుడు వాడ గణేష్ (29) బెంగళూరులో ఓ బ్యాంక్ లో ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడే కెఆర్ నందు రూము అద్దెకు తీసుకొని ఉద్యోగానికి వెళ్లి వస్తుండేవాడు. అప్పుడప్పుడు స్వగ్రామానికి వెళ్లి వచ్చేవాడు. శనివారం బెంగళూరు నుండి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయదేరాడు. మదనపల్లె సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చి టాటా టాటా ఏసీ వాహనం డీ కొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుదేహాన్నీ పోస్టుమార్టం నిమిత్తం స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జి.గణేష్ కుటుంబానికి సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి, మృతుడి బాబాయ్ వాడ గంగరాజు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. **తంబళ్లపల్లి :** వ్యవసాయ కూలి పనులకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన విషాద సంఘటన శనివారం మండలంలో జరిగింది. కుటుంబీకుల కథనం మేరకు వివరాలు పరుసుతోపు పంచాయతీ చిన్నప్ప గారి పల్లెకు చెందిన చంద్రమోహన్ చేతి మగ్గం నేస్తూ భార్య సుశీలమ్మ (44)వ్యవసాయ కూలి పనులకు వెళ్తూ ముగ్గురు పిల్లలను పోషించుకునేవారని అన్నారు. శనివారం తోటి కూలీలు ఆటోలో వెళ్ళగా ఆలస్యం కావడంతో భర్త చంద్రమోహన్ ద్విచక్ర వాహనంలో సుశీలమ్మను చౌడు సముద్రం సమీప పొలం వద్దకు తీసుకెళ్తుండగా చెట్లవారిపల్లి వద్ద ద్విచక్ర వాహనం పట్టు తప్పి రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయాలై ఆమె అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.